




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 32 | గురువారం 26 జూన్ 2025 | పేజీలు : 9 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ఎమర్జెన్సీ చీకటి ఘట్టం, ఏ భారతీయుడూ మర్చిపోడు

- ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు
- అదే రోజును 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నాం- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ

న్యూఢిల్లీ- సూర్యవాస్తవం, జూన్ 25

భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు.

ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు.



ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను

- మిగతా 2లో..

# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా

- స్పందించిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి
- యాక్సియం-4 మిషన్‌లో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం
- ఫ్లోరిడా నుంచి ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా విజయవంతంగా నింగిలోకి
- శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి, ప్రధాని మోదీ అభినందనలు
- 14 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో బృందం సభ్యులు



అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25

భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు. ఈ అంతర్జాతీయ బృందానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ప్రయోగం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ శుభాంశు శుక్లాకు, మిషన్ బృందానికి అభినందనలు తెలిపారు.

### రాష్ట్రపతి, ప్రధాని ప్రశంసలు

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ, "భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారు. మీ ప్రయాణం పట్ల దేశం మొత్తం గర్వంగా, సంతోషంగా ఉంది. మీరు, యాక్సియం-4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు 'వసుధైక కుటుంబం' అనే భావనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. నాసా, ఇస్రో మధ్య నెలకొన్న శాశ్వత భాగస్వామ్యానికి ఈ మిషన్ అద్దం పడుతోంది. ఈ యాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు నిర్వహించే ప్రయోగాలు, శాస్త్రీయ అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ అంతరిక్ష యాత్ర విజయంపై స్పందించారు. భారత్, హంగేరీ, పోలాండ్, అమెరికా దేశాలకు చెందిన వ్యోమగాములతో కూడిన ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని ప్రధాని మోదీ అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలలు, ఆశలు, ఆకాంక్షలను శుభాంశు తనతో పాటు మోసుకెళ్లారని ఆయన అభివర్ణించారు.

అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం)

- మిగతా 2లో..

# 'బంగారు కుటుంబాల'కు అండగా 'మార్గదర్శులు'

- పీ4పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ4 విధానం అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- 'మార్గదర్శుల' ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 19 లక్షలకు పైగా 'బంగారు కుటుంబాల' గుర్తింపు, 87 వేలకు పైగా దత్తత
- పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు భాగస్వాములు కావాలని సీఎం పిలుపు
- పర్యవేక్షణకు కాల్ సెంటర్, త్రైమాసిక సమీక్షలు, ఆడిటింగ్ ఏర్పాటు
- పీ4 కార్యక్రమ ప్రచారానికి లోగో ఎంపిక, మార్చి 30న వార్షికోత్సవ నిర్వహణ

అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25

రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 (ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన) కార్యక్రమం అమలు తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'మార్గదర్శుల' గుర్తింపు, 'బంగారు కుటుంబాల' ఎంపిక వంటి కీలక అంశాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. పీ4 విధానం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు చేయూత అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,15,771 'బంగారు కుటుంబాల'ను గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీరిలో ఇప్పటివరకు 87,395 కుటుంబాలను 'మార్గదర్శులు' (స్వచ్ఛందంగా సహాయం చేసే వ్యక్తులు) దత్తత తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా




ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సమాజంలో చాలా మంది వివిధ రూపాల్లో పేదలకు సాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని, అటువంటి వారికి పీ4 కార్యక్రమాన్ని ఒక మంచి వేదికగా మార్చాలని అన్నారు. 'మార్గదర్శులు'గా ఉండటానికి ముందుకు వచ్చేవారిని సంప్రదించి, వారిని 'బంగారు కుటుంబాల'తో అనుసంధానించే ప్రక్రియపై మరింత

- మిగతా 2లో..




## ఇకపై ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు
- తల్లికి వందనం, మెగా డీఎస్సీ వంటి హామీల అమలు ప్రస్తావన
- అహంకారం వీడి, ఓర్పు సహనంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచన
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఏర్పాటు
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్న లోకేశ్

అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25

రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ చేరవేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని ఈ సందర్భంగా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేశ్ వెల్లడించారు. "కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తు న్నాను. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుకుంటాం" అని ఆయన అన్నారు.

గత ఎన్నికలకు ముందు నిర్వహించిన బాబు సూపర్-6, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు ఎన్నికల అనంతరం చేపట్టిన

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం

- రాజ్యాంగ ద్రోహం: డిప్యూటీ సీఎం పవన్
- ఎమర్జెన్సీ భారత చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయమన్న పవన్
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వ అధికార దాహానికి నిదర్శనమని విమర్శ
- రాజ్యాంగానికి ద్రోహం, ప్రజాస్వామ్యానికి అపహాస్యం జరిగిందని వ్యాఖ్య
- ఈ దినాన్ని 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు వెల్లడి

2లో



# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన నిమిషాలకే, వ్యోమగాములు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విజయవంతంగా విడిపోయి, భూకక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 28 గంటల ప్రయాణం అనంతరం, గురువారం సాయంత్రం 4:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కానుంది.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాంశు శుక్లా నేతృత్వంలోని బృందం 14 రోజుల పాటు బస చేస్తుంది. ఈ సమయంలో వారు భారరహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షం నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో, పాఠశాల విద్యార్థులతో, ఇతర ప్రముఖులతో సంభాషించనున్నారు. ఈ యాత్ర ద్వారా అంతరిక్ష విజ్ఞాన రంగంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం, ఏ భారతీయుడూ మర్చిపోడు

(మొదటిపేజీ తరువాయి)

మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు.

ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్‌ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

# ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం

(మొదటిపేజీ తరువాయి)

స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఇది కేవలం రాజకీయ ఘటన మాత్రమే కాదని, రాజ్యాంగానికి జరిగిన ఘోర ద్రోహమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనని, నాటి కాంగ్రెస్ నాయకత్వపు అధికార దాహానికి నిదర్శనమని జనసేనాని తీవ్రంగా విమర్శించారు.

ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పవన్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ద్వారా స్పందించారు. "పత్రికల గొంతు నొక్కేశారు. ప్రతిపక్షాల స్వరం అణచివేశారు. ప్రాథమిక హక్కులను కాలరాశారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్, మొరార్జీ దేశాయ్ వంటి ఎందరో మహానాయకులను ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలబడినందుకు జైళ్లలో నిర్బంధించారు" అని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు.

"ఈ రాజ్యాంగ ద్రోహానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా నిలబడి మన ప్రజాస్వామ్య గౌరవాన్ని నిలబెట్టిన వారి త్యాగాలను స్మరించుకుంటూ 'సంవిధాన్ హత్య దివస్' పాటిస్తున్నాం. అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన నాయకుల త్యాగాలను, గొంతులు నొక్కేయబడిన లక్షలాది మంది ఆవేదనను మనం గుర్తుంచుకోవాలి. రాజకీయాల పేరుతో మన రాజ్యాంగంతో రాజీపడే ఏ ప్రయత్నాన్నైనా ఈ రోజు కూడా మనం అప్రమత్తంగా ఎదుర్కోవాలి" అని పవన్ కల్యాణ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# జగన్ ర్యాలీలపై నిషేధం విధించాలి

**- సింగయ్య మృతి ఘటనలో జగన్‌పై ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహం**
**- మూడు కార్లకే అనుమతి ఉంటే, వేల మందితో ఎలా పర్యటిస్తారని ప్రశ్న**
**- ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని జగన్ పట్టించుకోలేదని ఆరోపణ**
**- జగన్ తీరుపై పోలీసుల నిర్లక్ష్యంపై కూడా షర్మిల విమర్శలు**
**- జగన్ పర్యటనలు, ప్రదర్శనలు నిషేధించాలని డిమాండ్**

అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25



రెంటపాళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోమారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటనకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే బాధ్యత అని ఆమె ఆరోపించారు. గుంటూరులో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సింగయ్య మృతికి జగన్‌కు బాధ్యత లేదా అని షర్మిల ప్రశ్నించారు. "పోలీసులు కేవలం మూడు కార్లకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పుడు, వేల మందితో కలిసి జగన్ ఎలా పర్యటన నిర్వహించారు?" అని ఆమె నిలదీశారు. ప్రమాదంలో కారు కింద పడిపోయిన వ్యక్తిని ఏమాత్రం పట్టించుకోకుండా జగన్ తన పర్యటనను కొనసాగించడం దారుణమని షర్మిల అన్నారు. జగన్ గతంలో కూడా అనేక తప్పులు చేశారని, అందుకే ఆయనపై కేసులు నమోదయ్యాయని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనలో పోలీసుల వైఖరిని కూడా షర్మిల తప్పుపట్టారు. "వేల మందితో నిబంధనలకు విరుద్ధంగా వస్తుంటే పోలీసులు ఎందుకు అడ్డుకోలేదు?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ నిర్వహించే ప్రతి పర్యటన జన సమీకరణ, బలప్రదర్శన కోసమేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని ఆమె విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఏ ఒక్క సమస్యను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, జగన్ నిర్వహించే ప్రదర్శనలు, పర్యటనలను తక్షణమే నిషేధించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను గాలికొదిలి, నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగే ఇలాంటి కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# 'బంగారు కుటుంబాల'కు అండగా 'మార్గదర్శులు'

(మొదటిపేజీ తరువాయి)

శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కాల్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మార్గదర్శులు'గా ఉండాలనుకునే వారికి అవసరమైన సమాచారం, మార్గనిర్దేశం అందించేలా వ్యవస్థలను పటిష్టం చేయాలని ఆదేశించారు. 'మార్గదర్శుల'తో 'బంగారు కుటుంబాల'ను అనుసంధానించిన తర్వాత, వారి జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి ప్రత్యేక సర్వేలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అమలులో పారదర్శకత కోసం తప్పనిసరిగా ఆడిటింగ్ నిర్వహించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష జరపాలని, పీ4 కార్యక్రమ ప్రభావాన్ని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు 'మార్గదర్శకుల'కు కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు.

పీ4 కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, ప్రముఖులు, ఉన్నత వర్గాల వారితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, వారిని 'మార్గదర్శులు'గా మారేందుకు ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో 'మార్గదర్శుల' భాగస్వామ్యం పెంచేందుకు దేశంలోని ప్రముఖ 100 కంపెనీలకు చెందిన సీఈఓలు, సీవోవోలు, సీఎఫ్ఓలు, ఎండీలు, ఛైర్మన్‌లతో తానే స్వయంగా మాట్లాడి పిలుపునిస్తానని చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతేకాకుండా, దేశవిదేశాల్లో ఉన్న తెలుగువారితో వర్చువల్ విధానంలో సమావేశమై, ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను, ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించి, వారిని 'మార్గదర్శులు'గా ముందుకు వచ్చేలా ప్రోత్సహిస్తానని అన్నారు. ఎన్నారైలను పీ4 కార్యక్రమానికి సలహాదారులుగా నియమించి, తద్వారా మరింత మంది ఎన్నారైలు 'మార్గదర్శకులు'గా చేరేలా ప్రోత్సహించాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఈ సమీక్షలో భాగంగా, జీరో పావర్టీ, పీ4 కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు రూపొందించిన పలు లోగోలను ముఖ్యమంత్రి పరిశీలించారు. త్వరలోనే ఒక లోగోను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్చి 30వ తేదీని ఏటా 'పీ4 వార్షికోత్సవం'గా నిర్వహించి, సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ, ఆర్థిక, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇకపై ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని ప్రశంసించారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని గుర్తుచేశారు.

**జులై 2 నుంచి గడపగడపకు వెళ్లండి**

జులై 2వ తేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. "బాబు సూపర్%-%6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నిర్దేశిత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం" అని తెలిపారు.

మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయబోతున్నామని లోకేశ్ ప్రకటించారు.

**అహంకారం వీడండి, ఓర్పుతో ప్రజల్లోకి వెళ్లండి**

ప్రజలు అహంకారాన్ని, ఇగోలను ఏమాత్రం హర్షించరని లోకేశ్ పార్టీ శ్రేణులకు హితవు పలికారు. "గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే వారి సంఖ్య 151 నుంచి 11కి పడిపోయింది. ఏ నాయకుడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుంది. ప్రజల్లోకి వెళ్లి ఓర్పు, సహనంతో వారు చెప్పే సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి కృషిచేయండి" అని సూచించారు.


గత ప్రభుత్వం కక్షసాధింపు చర్యగా నిలిపివేసిన ఉపాధి హామీ, నీరు%-%చెట్టు పథకాల బిల్లులను 90 శాతం వరకు క్లియర్ చేశామని, మిగిలిన బిల్లులను కూడా జులైలోగా అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వంటి సమస్యలుంటే మంగళగిరిలోని కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి**

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి దివాలా తీయించిందని లోకేశ్ విమర్శించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ అన్ని విధాలా సహకరిస్తూ రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తున్నారని అన్నారు. అమరావతి, విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్ వంటి అన్ని కీలక అంశాలపై ప్రధాని సానుకూలంగా ఉన్నారని తెలిపారు. "రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పడింది. ఈ కూటమిలో మనది పెద్దన్న పాత్ర. ఏవైనా సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలి" అని దిశానిర్దేశం చేశారు. టీడీపీ చొరవ వల్లే వక్ఫ్ బిల్లులో నాలుగు కీలక సవరణలు చేశారని, ఇది పార్టీకి ఉన్న కమిట్‌మెంట్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీలో ఏ ఒక్క నాయకుడు కూడా గతంలో తాము పడిన ఇబ్బందులు, ఎదుర్కొన్న అవమానాలను మరువకూడదని హితవు పలికారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తాను ఆయనను కలిసేందుకు తీవ్రస్థాయిలో పోరాడాల్సి వచ్చిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాశ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో క్వాంటం వ్యాలీ

**- ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి కీలక స్థానం!**
**- అమరావతిని గ్లోబల్ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు**
**- జూన్ 30న విజయవాడలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జాతీయ వర్క్‌షాప్**
**- 2026 జనవరికి అమరావతి క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ ఏర్పాటు లక్ష్యం**
**- అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25 ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ - సంస్థల భాగస్వామ్యం**
**- దేశంలోనే అతిపెద్ద క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటుకు ఐబీఎం సన్నాహాలు**




అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 25

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిని అంతర్జాతీయ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా క్వాంటం టెక్నాలజీలపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను అమరావతి క్వాంటం వ్యాలీ ఆధ్వర్యంలో నిర్వహించనుంది. ఈ నెల 30న విజయవాడలో జరగనున్న ఈ కీలక కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. దీనికి సన్నాహకంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ శాఖ విజయవాడలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించింది.

2026 జనవరి నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీని పూర్తిస్థాయిలో నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా క్వాంటం కంప్యూటింగ్, సంబంధిత టెక్నాలజీలలో భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ జాతీయ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. ఒక రోజు పాటు జరిగే ఈ సదస్సులో క్వాంటం హార్డ్‌వేర్‌తో పాటు ఇతర కీలక అంశాలపై నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశాలు ఉంటాయి. ఐబీఎం, టీసీఎస్, అమెరికన్ కాన్సులేట్ ప్రతి నిధు లు, నీతి ఆయోగ్ అధికారులు, వివిధ ఐఐటీల ప్రొఫెసర్లు, నిపుణులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ప్లీనరీ సెషన్లలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు క్వాంటం వ్యాలీ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించి, "అమరావతి డిక్లరేషన్"ను అధికారికంగా విడుదల చేయనున్నారు. దీంతో పాటు క్వాంటం స్టార్టప్, క్వాంటం డిక్లరేషన్ పుస్తకాన్ని కూడా సీఎం ఆవిష్కరిస్తారు.

**2026 జనవరికి అమరావతి క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ సిద్ధం**

రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం, ప్రఖ్యాత సంస్థలైన ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీలు అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. ఇందులో భాగంగా, ఐబీఎం సంస్థ దేశంలోనే అతిపెద్ద క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో నెలకొల్పనుంది. రెండు 156 క్యూబిట్ క్వాంటం సిస్టంలను ఐబీఎం ఇక్కడ ఇన్స్టాల్ చేయనుంది. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఎల్ అండ్ టీ సంస్థ సమకూర్చనుంది. టీసీఎస్ సంస్థ క్వాంటం కంప్యూటింగ్ సేవలతో పాటు హైబ్రిడ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్‌ను అందించనుంది. వైద్యారోగ్యం, ఆర్థిక, ఉత్పత్తి రంగాలతో పాటు అనేక ఇతర రంగాలకు ఈ క్వాంటం వ్యాలీ సేవలందించనుంది.

ఈ ప్రాజెక్టుపై ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ, "అమరావతిలో 2026 జనవరి నాటికి భారతదేశపు మొదటి క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ప్రారంభమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా విద్య, వైద్యారోగ్యం, ఫార్మా, అగ్రిటెక్, మెడ్‌టెక్ సంస్థలు ఈ వ్యాలీ సేవలను వినియోగించుకోవచ్చు. భవిష్యత్తులో లక్షల మంది ఇక్కడ పనిచేసే అవకాశం ఉంది. స్టార్టప్‌లతో పాటు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఏపీ యువతకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా నైపుణ్య శిక్షణ కూడా అందిస్తాం. క్వాంటం టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది కేవలం అపోహ మాత్రమే. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగానే ఈ సెంటర్ పనిచేస్తుంది. క్వాంటం కంప్యూటింగ్ ఉత్పాదకతను పెంచి తద్వారా సంపద, సమృద్ధిని సాధించేందుకు దోహదపడుతుంది" అని తెలిపారు.

**క్వాంటం విప్లవాన్ని అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందంజ**

క్వాంటం టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునే తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. సమీప భవిష్యత్తులో క్వాంటం టెక్నాలజీ ఊహించని వేగంతో జనజీవితంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. "క్వాంటం కంప్యూటింగ్ అత్యంత వేగంగా, కచ్చితత్వంతో కూడిన ఫలితాలను అందిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు అత్యంత సురక్షితమైన క్వాంటం క్రిప్టోగ్రఫీ వైపు మళ్లుతున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, రక్షణ రంగం, వైద్యారోగ్యం, విద్య వంటి అనేక రంగాల్లో క్వాంటం వినియోగం పెరుగుతోంది. నెలలు, సంవత్సరాలు పట్టే పరిశోధనా సమయం క్వాంటం టెక్నాలజీతో నిమిషాలు, గంటల్లోకి తగ్గిపోతుంది. రాష్ట్రంలోని యువత ఐటీ రంగంలో నిష్ణాతులు కాబట్టి, ఈ విప్లవాన్ని అందిపుచ్చుకుని నాయకత్వం వహించగల సత్తా ఏపీకి ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏపీ కీలక స్థానానికి చేరుతుంది. క్వాంటం వ్యాలీ ఏర్పాటుపై దేశమంతా ఇప్పుడు ఏపీ వైపు, అమరావతి వైపు చూస్తోంది" అని ప్రద్యుమ్న వివరించారు.

# సంపాదకీయం

## కూటమి కాన్ఫిడెన్స్ లెక్కేంటో?



ఏపీ పాలిటిక్స్‌లో మళ్లీ జగన్ వర్సెస్ పవన్ ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా మారుతోంది. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఆ ఇద్దరి మధ్య నెక్స్ట్ లెవల్‌లో మాటల యుద్ధం కొనసాగింది. ఇక ఏడాదిగా చూస్తే జగన్, పవన్ మధ్య అప్పుడప్పుడు డైలాగ్ వార్ నడుస్తున్నా ఇష్యూ బేస్డ్‌గా మాట్లాడి అక్కడితో వదిలేస్తున్నారు. ఇప్పుడు మరోసారి జగన్, వైసీపీపై పవన్ కౌంటర్లు వేస్తుండటంతో రాజకీయ వేడి రాజుకుంటోంది.జగన్ రెంటపాళ్ల పర్యటనలో ప్లకార్డులు, ఆ తర్వాత ఆయన కామెంట్స్‌తో పొలిటికల్ హీట్ పెరిగింది. వైసీపీ, జగన్ టార్గెట్‌గా పవన్ స్ట్రాంగ్ వార్నింగే ఇచ్చారు. తొక్కి నార తీస్తామని, మక్కెలు విరగగొట్టి కూర్చోబెడతామంటున్నారు పవన్. అసాంఘిక శక్తులను ఏరివేస్తామన్నారు. రోడ్డెక్కి పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే అసలు ఊరుకోమంటున్నారు. గొంతు కోస్తామని అంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సరదాగా ఇక్కడ ఎవరూ కూర్చోలేదంటున్న పవన్..అధికారంలో ఉన్నపుడు అరాచకాలు సృష్టించారని ఇపుడు కూడా అలాగే చేద్దామనుకుంటే లైట్ తీసుకునే ముచ్చటే లేదంటున్నారు.అంతే కాదు కూటమి ఐక్యతకు తాను ప్రాధాన్యత ఇస్తాననని 20 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగుతుందని క్లారిటీగా చెబుతున్నారు పవన్. మళ్లీ జగన్ ప్రభుత్వం రానే రాదు..తాను మాట ఇస్తున్నానంటున్నారు పవన్. కనీసం పదిహేనేళ్లు కూటమి పవర్‌లో ఉంటుందని భరోసా ఇస్తున్నారు. అటు సీఎం చంద్రబాబు మాట తీరులోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలకు వాస్తవాలు చెప్పాలనే ఆలోచన బాబు ప్రసంగాల్లో స్పష్టమవుతోంది. అన్నీ చేసేశామని చెప్పటం లేదు కానీ..ఊహించిన దానికంటే ఎక్కువగా..చెప్పనివి కూడా చేశామని మాత్రం చెప్పగలను అంటున్నారు చంద్రబాబు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ ప్రయాణం మొదలైందో..ఏడాదిలో ఏం సాధించామో ప్రజలే విశ్లేషించుకోవాలని కోరుతున్నారు. అయితే అటు చంద్రబాబు, ఇటు పవన్ మాటల్లో అయితే వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. దీని వెనుక మర్మమేంటన్న దానిపై మాత్రం పెద్దఎత్తున డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ స్కీమ్‌లలో చాలావరకు అమలు చేశారు. ఇంకా ఒకటో, రెండో స్కీమ్‌లు పెండిరగ్‌లో ఉంటే..వాటిని ఎప్పటి నుంచి ఇంప్లిమెంట్ చేస్తామో షెడ్యూల్ కూడా ప్రకటించేశారు.ఇక రోడ్లు బాగు చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెడుతున్నారు. పైగా వైసీపీ వ్యవహరిస్తున్న తీరు తమకు ప్లస్ పాయింట్ గా మారుతుందని భావిస్తున్నారట కూటమి పెద్దలు. అపోజిషన్‌లో ఉన్నప్పటికీ అరాచకాలు, అడ్డగోలు మాటలు.. మాట్లాడుతున్నారని..వైసీపీని ప్రజలు ఓడిరచిందే అందుకని..రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని అంచనా వేస్తున్నారట కూటమి లీడర్లు.ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న స్కీమ్‌లు..ఇప్పటికీ ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత ఉందన్న నమ్మకం..కూటమి ఐక్యతే తమను తిరిగి మళ్లీ మళ్లీ నిలబెడుతుందని నమ్ముతున్నారట కూటమి అగ్రనేతలు. మొన్నటి ఎన్నికలకు ఇప్పటికి కూటమికి మైలేజ్ పెరిగిందని..చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం ఉందని భరోసాగా ఉన్నారట. అందుకే వైసీపీ మళ్లీ రానే రాదన్న గట్టి నమ్మకంతో ఉన్నారట పవన్. పైగా మళ్లీ కూటమిగా వెళ్తామని చెప్పడం ద్వారా పబ్లిక్ మూడ్‌ను మరింతగా తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తున్నారని అంటున్నారు.అయితే పవన్ మాటలను లైట్ తీసుకోలేమని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. సేమ్‌టైమ్ పవన్ అంత నమ్మకంతో చెప్తున్నారంటే కూటమి దగ్గర ఫ్యూచర్ ప్లాన్స్ ఉండే ఉంటాయంటున్నారు. ఎలక్షన్స్ ముందు ఫాలో అయ్యే స్ట్రాటజీ.. స్కీమ్‌ల ఇంప్లిమెంటేషన్ కూడా అంతా పక్కా స్కెచ్ ప్రకారమే చేసుకుంటూ వస్తున్నారని చెప్పుకొస్తున్నారు. పవన్ మాటలు నిజం అవుతాయా? జగన్ ఒంటరి పోరు ఆయన్ను తిరిగి నిలబెడుతుందా? అనేది చూడాలి.

# మత్తుతో యువత బంగారు భవిష్యత్తు చిత్తు

## - నేడు అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం

అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల వినియోగం విద్యార్థుల్లో, యువతలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. చాలామంది మద్యం, సిగరెట్లు, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. తద్వారా తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఆ మత్తులో చెడుమార్గంలో పయనిస్తూ ఇటు కుటుంబానికి, అటు సభ్య సమాజానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారు.

చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలకు అలవాటుపడి చదువును పాటు చేసు కుంటు న్నారు. ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువ జవసత్వాలు సన్నగిల్లి యవ్వనంలోనే శారీరకంగా, మానసికంగా నిర్వీ ర్యమై పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న అంతర్జాతీయ అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని జరుపు కుంటారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడు దుష్ఫలితాలు గురించి, అక్రమ రవాణాను అరికట్టడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్యో ద్దేశ్యం. ప్రపంచవ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది.




1987 నుంచి ఐక్యరాజ్యసమితి ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దేశ దేశాల ప్రభుత్వాలను ఈ మహమ్మారి వ్యాప్తి గురించి హెచ్చరిస్తోంది. మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా ప్రపంచమంతటా కార్యక్రమాలు జరుపుకోడానికి జూన్26వ తేదీన ఐరాస సర్వ ప్రతినిధి సభ 1987లో మొట్టమొదటిసారిగా తీర్మానించింది. మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా మానవాళిని రక్షిం చేందుకు, మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని సృష్టిం చేం దుకు గాను ప్రమాణం చేసే లక్ష్యంతో జూన్26ను అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినంగా ఐరాస ప్రకటించింది.

ప్రతి ఏటా జూన్26న ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాలను స్వాధీనపర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది..టీనేజ్ పిల్లలు డ్రగ్స్ వైపు మొగ్గు చూపటంలో ప్రధానంగా నెగెటివ్ కుటుంబ వాతావరణం కూడా ఒక ముఖ్యకారణం. తల్లిదండ్రులు ఘర్షణతో ఉన్నా, పిల్లలతో మంచి అనుబంధం ఏర్పర్చుకోకపోయినా, ఆత్మీయంగా వారితో సమయం గడపకపోయినా 'మనం పట్టని తల్లిదండ్రుల' కంటే 'మనకు కిక్ ఇచ్చే డ్రగ్స్ మేలు' అనే భావనలో భ్రష్ట సాంగత్యాల్లోకి పిల్లలు వెళ్తుంటారు. చదువుతోపాటు క్రీడలు, కుటుంబ సభ్యుల మధ్య అన్యోన్యత, బంధుమిత్రులు, క్రమశిక్షణల ఆర్థిక పరిస్థితి, భావోద్వేగాలకు అయిన వారు ఉన్నారన్న భరోసా, విలువలు ఏదో ఒక ఆత్మీయ ఆలంబన వంటివి టీనేజ్ పిల్లల రోజువారీ జీవనంలో ఉంటే వారు డ్రగ్స్ బారిన ఏమాత్రం పడరు. సరదా షికార్లు, స్లీప్ ఓవర్‌ల సమయంలో సరదా కొద్దీ సీనియర్లో, స్నేహితులో డ్రగ్స్ ఇస్తుంటారు. ఇవి తీసుకున్నాక ఇంకా ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయో వెతుకులాట సాగిస్తారు. ఇక అంతటితో వారి చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వం మొత్తం ధ్వంసమైపోతాయి. తల్లిదండ్రులు మందలిస్తే 'మీరిలా తిడితే ఇల్లు విడిచివెళ్లిపోతాం' అంటూ బ్లాక్‌మెయిల్ కూడా చేస్తుంటారు. వీరిని చాలా ఓర్పుతో థెరపీల ద్వారా తిరిగి మామూలు మనుషులుగా చేయాల్సి వుంది.

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్

## -నేడు ఆయన జయంతి

భారతదేశ చరిత్రలో దళిత, బహుజనులను విముక్తి చేయటానికి సైద్ధాంతికంగా, పాలనపరంగా మహాత్మ జ్యోతి బాఫూలే, ఛత్రపతి శివాజీల వారసుడిగా కృషి చేసిన మహనీయుడు రాజర్షి ఛత్రపతి సాహుమహారాజ్. 1874 జూన్ 26న రాధాబాయి, జయసింగ్ అబాసాహేబ్ ఘాట్గేలకు జన్మించిన యశ్వంతరావు ఘాట్గేనే ఆ తర్వాత కాలంలో సాహు మహారాజ్‌గా ప్రసిద్ది చెందాడు. ఘాట్గేలు మహారాష్ట్రలో వెనుకబడిన తరగతుల (ఓబీసీ)కి చెందిన వారు, వ్యవసాయం చేసుకొని జీవించే "కున్బీ" కాపు కులం వారిది. ఛత్రపతి శివాజీ స్థాపించిన మరాఠ సామ్రాజ్యంలోని కొల్హాపూర్ రాజ్యంలో వారసులు లేకుంటే నాల్గవ శివాజీ భార్య రాణి ఆనందబాయి తన బంధువుల అబ్బాయిని దత్తపుత్రుడిగా స్వీకరించి యశ్వంత్‌రావు ఘాట్గేకి ముద్దుగా 'సాహు' అని పేరు పెట్టుకుంటది. మూడేండ్లకే తల్లిని కోల్పోయిన సాహు, 1886 మార్చి 20న తండ్రి మరణంతో 11 ఏండ్లకే తల్లిదండ్రులిద్దరులేని వాడైనాడు. సాహు చిన్నతనమంతా ఆంగ్లేయ అధ్యాపకుల పర్యవేక్షణలో జరిగినందున ఆధునిక భావాలు పుణికి పుచ్చుకున్నాడు. యుక్తవయసు రాగానే 1894 ఏప్రిల్ 2న సింహాసనం అధిష్టించాడు సాహు. 1900వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒక రోజు సాహు మహారాజ్ పంచగంగా నదిలో స్నానం చేస్తున్న సమయంలో బ్రాహ్మణ పురోహితుడు స్నానం చేయకుండానే వచ్చి సాహు మహారాజ్ క్షత్రియ వంశస్తుడు కానందున, ఒక వ్యవసాయం చేసుకునే కులానికి చెందిన శూద్రుడైనందున ఈసడింపుతో వేదోక్త మంత్రాల బదులు పౌరాణిక మంత్రాలు చదివి అవమానిస్తాడు. పుట్టుకతోనే మనిషి కులం నిర్ణయించబడుతుందనీ రాజైనంత మాత్రాన, దత్తత వచ్చినంత మాత్రాన క్షత్రియుడిగా మారిపోడని వాదనకు దిగుతాడు. ఈ సంఘటన సాహు మహారాజ్‌ని మహాత్మ జ్యోతిబాఫూలే సత్యశోధక సమాజ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే వారసత్వాన్ని ఎన్నుకోవడానికి కారణమైంది. బాస్కర్‌రావు జాదవ్ అనే ఉద్యోగిని 'సత్యశోధక్ సమాజ్' నడిపే బాధ్యతలు అప్పచెప్పి 'మరాఠ దీనబంధు' పేరుతో పత్రికని నడిపించి సత్యశోధక సమాజ తాత్విక దక్పథాన్ని ప్రచారం చేయించిండు.

బ్రాహ్మణేతరులకి పురోహిత శిక్షణనిచ్చేందుకు సత్యశోధక్ సమాజ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభమైంది. కొల్హాపూర్ పరిసర ప్రాంతాల్లో వందలా ది వివాహాలు, వేడుకలు సత్యశోధక్ సమాజ్ పద్ధతిలో జరిగాయి. తను సిం హాసనం అధిష్టించే నాటికి తన రాజ్యం లో మత కర్మలలో మొదలు పరిపాలన లోని అన్ని ఉద్యోగ రంగాలతోపాటు వ్యాపారం, వడ్డీ వ్యాపారంలో కూడా బ్రాహ్మణులే నిండిపోవడం సాహు గమనించాడు. బ్రాహ్మణేతరులని ఉన్న తోద్యోగాల్లోకి తెస్తే తప్ప వారి సామాజిక హోదాలో, జీవితాల్లో మార్పు రాద ని, బ్రాహ్మణ ఆధిపత్యానికి అడ్డుకట్ట పడదని సాహు భావించిండు. వెనుకబడిన కులాల వారందరికీ స్కూల్స్, వసతి గృహాలు ప్రారంభించి విద్యని ఒక ఉద్యమంగా నడిపిండు. కొల్హాపూర్ పట్టణంలో హాస్టల్స్ కాలనీనే నిర్మించిండు. 1901 లో జైన హాస్టల్, విక్టోరియ మరాఠ హా స్టల్, 1906లో ముస్లింలకు, 1907లో వీరశైవ లింగాయత్‌లకు, 1908లో అంటరానివారికి, మరాఠాలకీ 1921లో దర్జీ, నేత కులస్తులకి నామ్ దేవ్ హాస్టల్, విశ్వకర్మలకి సోనార్ హాస్టల్స్ నిర్మించిండు. ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమి క పాఠశాలనేర్పరచి అందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనందించిండు. పాఠశాలలకు స్వంత భవనాలు ఏర్పడే వరకు గ్రామాల్లోని అన్ని ఆలయాలను, చావడీలను పాఠశాలలుగా వాడాలనీ, ఏ గ్రామంలో ఏ కులస్తులు మెజారిటీగా ఉన్నారో చూసి ఆ కులపు వ్యక్తినే ఉపాధ్యాయుడిగా నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.



ముస్లింలకు వాళ్ల మాతృ భాషలోనే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కాలంలో కొంత మార్పు రాగానే కులపరమైన విద్యాసంస్థల ని రద్దు చేస్తూ అన్ని కులాలు, మతాల వారు కలిసిమెలిసి ఏ పాఠశాలలోనైనా, విద్యా సంస్థలోనైనా చదువొచ్చని ప్రకటన ఇచ్చింది సాహు ప్రభుత్వం. వ్యవసాయం ఇతర వత్తులు చేసే వయోజనుల కోసం రాత్రి పాఠశాలలు ఏర్పడ్డాయి. జులై 26, 1902 భారతదేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక దినం. ఆ రోజు ఛత్రపతి సాహు మహారాజ్ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగాలన్నింటిలో వెనుకబడినవర్గాల వారికి 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులని జారీ చేసింది. వెనుకబడిన వర్గాలు అనగా బ్రాహ్మణ, ప్రభు, షెన్వీ, పార్శీ ఇతర అభివద్ధి చెందిన కులాలు మినహా మిగిలిన అన్ని కులాల వారు అంటరానివారి నుండి అన్ని మతాలలో వెనుకబడినవారు కూడా రిజర్వేషన్ కిందికే వస్తారు. గ్రామ పరిపాలన రంగంలో వంశపారంపర్యంగా వచ్చే ముఖ్యులైన పటేల్ (పాటిల్), పట్వారీ (కులకర్ణి) వ్యవస్థని 1918లో రద్దు చేసిండు. ఉపాధ్యాయులుగా కూడా వారసత్వంగా పని చేయడాన్ని రద్దు చేసిండు. టీచర్ ట్రైనింగ్, పాటిల్ ట్రైనింగ్ స్కూల్స్ పెట్టించిండు.

విద్యారంగంలో సాహు కషి కేవలం అక్ష రాస్యతకే కాకుండా సంగీత, సాహిత్య, నాటక ప్రక్రియలన్నింటిని ప్రోత్సహించిండు. సాహు కాలంలో నాటక రంగం అభి వృద్ధి చెందింది. కొల్హాపూర్ జ్ఞాన సమాజ్, కిర్లోస్కర్ కం పెనీ, స్వదేశ్ – హితా చింతక్ వంటి నాటక సమాజాల కు ఉదారంగా విరాళాలిచ్చేవాడు. భారత దేశంలో మొట్ట మొదటి మహిళా నాటక సమాజమైన 'శేషశాని స్త్రీ సంగీ త నాటక మండలి' కొల్హాపూర్‌కి చెందినదే. సాహు ఏర్పరిచిన భూమికపై నుండే వి.శాంతారాం, మాస్టర్ వినాయక్ షిండే లాంటి ప్రసిద్ధులైన సినిమా దర్శకులు కొల్హాపూర్ ప్రాంతం నుండి వచ్చారు. 1919 సెప్టెంబర్ 6న అంటరానితనం పాటించడం నేరమని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. ప్రజలు గానీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర ఉద్యోగులు అగౌరవంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదు అందితే నేరస్తుల మీద చర్యలు తీసుకుంటారు. నేరస్తులు ఉద్యోగులైతే ఆరు వారాల్లోగా విచారణ జరిపి నేరస్తులని తేలితే ఉద్యో గం నుండి తొలగింపుతోపాటు పెన్షన్ కూడా రద్దైపో తుంది. 1920 మే 3వ తేదిన వెట్టిచాకిరి వ్యవస్థని రద్దు చేస్తూ చట్టం చేశాడు. గ్రామీణ పరిపాలనలో కింది స్థాయి ముఖ్య ఉద్యోగాలైన 'తలాతీ' ( సుంకరి, గ్రామ రెవెన్యూ సహాయకులు) లు గా అస్పృశ్యులే ఉంటారు కాబట్టి వాళ్లందరికీ ఉద్యోగ నిర్వహణకు అవసరమైన శిక్షణనిచ్చేందుకు ట్రైనింగ్ స్కూల్స్ ప్రారంభించిండు. 1919 నవంబర్ 6న వెలువడిన చట్టం ప్రకారం అన్ని వత్తుల్లోను, ఉద్యోగాల్లోను ఉండే అస్పృశ్యులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాన్ని కల్పించిండు.ఆదివాసీ తెగలకు, అంటరాని వారికి సంబంధించి బ్రిటీష్ ప్రభుత్వం పెట్టిన 'నేరస్థ కులాల చట్టాన్ని' 1918లో రద్దు చేసింద్రు. మహర్, మాంగ్, రామోషీ, బెరాడ్ లాంటి నేరస్థ కులాలుగా పరిగణింపబడే కులాల ప్రజలు ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌లో హాజరై సంతకం చేసే అమానుషం ఈ చర్యతో రద్దైంది. అంబేద్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం ఆ పత్రికకి ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యతను తీసుకొని మొదట రూ.2500 ఇవ్వడంతో 'మూక్ నాయక్' పత్రిక ప్రారంభమైంది.1920 ఏప్రిల్ 15న నాసిక్‌లో అంబేద్కర్ ఆయన మిత్రులు అంటరాని వారి కోసం ఒక హాస్టల్ కట్టాలనుకుంటే ఆ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ఐదు వేల రూపాయలు ఇచ్చాడు సాహు. 1920లో అంబేద్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేశాడు. అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంత కాలం 'మూక్ నాయక్' పత్రిక నిర్వహణకి ఆర్థిక సహాయం చేసిండు. పితస్వామ్య, కుల, మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషాలని గ్రహించిన సాహు మొదట తన భార్య లక్ష్మీబాయికి యూరోపియన్ టీచర్ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించిండు. సంగీతంలో, చిత్రలేఖనంలో, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇప్పించిండు. కొల్హాపూర్ సంస్థానంలో బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభం చేసిండు. ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు, ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసింద్రు. కొల్హాపూర్ రాజారాం కాలేజీలో బాలికలకు ప్రత్యేక విభాగం ఏర్పరిచింద్రు. వెనుకబడిన ఆడపిల్లలకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించింద్రు. 1919 జూన్‌లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జులై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చిన 'కొల్హాపూర్ స్పెషల్ మ్యారేజీ యాక్ట్ – 1918' ప్రకారం ఎందరో యువతీ యువకులు తమకు నచ్చిన భాగస్వాములని ఎన్నుకున్నారు. విడాకులు మంజూరు చేయడంలో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్టు 2న విడాకుల చట్టం, స్పెషల్ మ్యారేజీ యాక్ట్ అప్పుడు దేశంలో సంచలనం సష్టించాయి. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యస్థను రద్దు చేసిండు. ప్రభుత్వం దేవదాసీల పునరావాసానికి చర్యలు తీసుకుంది. 1919 జులైలో వ్యభిచార వత్తిలో ఉన్న స్త్రీలకు పునరావాసాన్ని కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించిండు. పరిపాలనలో ప్రజలకు అర్థం కాని, ప్రజలకు ఇబ్బంది కల్గించే బ్రాహ్మణ గుమస్తాలు, పట్వారీలు వాడే మోడీ లిపిని పరిపాలన వ్యవహారాల్లో రద్దు చేస్తూ 1917 మార్చిలో నిర్ణయం తీసుకున్నాడు.

కరువు వచ్చినపుడు రైతులకు అన్ని రకాల పన్నులను, రుణాలని మాఫీ చేసిండు. అప్పుల కింద రైతుల ఆస్తులని, పనిముట్లనీ, పశువులని బలవంతంగా జప్తు చేసే చర్యలను నిషేధిస్తూ 1894లోనే చట్టం చేసిండు. 1918లో తన రాజ్యంలో వడ్డీ వ్యాపారాన్ని పూర్తిగా నిషేధిస్తూ సహకార సంఘాలని ఏర్పాటు చేసిండు. రాధానగరి, పనాలా, కరవీర్, శిరోల్ వంటి ప్రాజెక్టలని నిర్మించిండు. 'కింగ్ ఎడ్వర్ట్ అగ్రికల్చరల్ ఇనిస్టిట్యూట్' ద్వారా రైతులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసిండు. స్వాతంత్రం గురించి సాహు 1917, డిసెంబర్ 27 నాసిక్‌లో జరిగిన సభలో 'ఇపుడున్న కులవ్యవస్థ యధాతథంగా కొనసాగుతూ ఉండేట్లైతే ఒకవేళ మన చేతికి రాజకీయాధికారం వచ్చినప్పటికీ అదొక నియంతత్వ రాజ్యంగానే తయారవుతుంది. స్వరాజ్యం పేరిట ఒక నియంతత్వ రాజ్యం ఏర్పడటాన్ని నిరోధించాలంటే కనీసం పదేండ్లపాటు వెనుకబడిన కులాలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించే విధానం కొనసాగాలి' అని అన్నాడు. ముంబాయిలో కార్మికుల ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ 'రష్యా, జర్మనీ, ఇంగ్లాండ్‌లలో వలే యుక్త వయసు వచ్చిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు ఉండాలి ' అన్నాడు. సాహు మహారాజ్ మే 6, 1922న మరణించిండు. అతని మరణాంతరం అంత్యక్రియలు సైతం బ్రాహ్మణేతర పురోహితుల చేతనే జరుపబడ్డాయి.

# లోకేష్ పై ప్రధాని పొగడ్తలు.. టీడీపీలో భయం

విజయవాడ- సూర్యవాస్తవం, జూన్ 25

ఏపీలో తెలుగుదేశం పార్టీ కంటే సీనియర్ భారతీయ జనతా పార్టీ. తెలుగుదేశం పార్టీ ఎంట్రీ సమయంలోనే విశాఖ నగరపాలక సంస్థను బిజెపి గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీని ఢీ కొట్టాలంటే బిజెపి అవసరమని గుర్తించారు నందమూరి తారక రామారావు. అప్పటినుంచి ఇప్పటివరకు బిజెపితో అప్పుడప్పుడు తప్ప మైత్రి కొనసాగుతూనే ఉంది. అయితే ఏపీలో టిడిపి బలమైన శక్తిగా ఎదిగింది. కానీ బిజెపి పరిస్థితి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. దీనికి కారణం చంద్రబాబు చతురత. చంద్రబాబు ఉన్నంతవరకు బిజెపి ఎంట్రీ అంత ఆషామాషీ కాదు. అదే బిజెపి పూర్తిస్థాయిలో ఎంట్రీ ఇస్తే టిడిపి మనుగడ కష్టం. అందుకే చంద్రబాబు చేతికి టీడీపీ పగ్గాలు వచ్చిన తర్వాత ఆయన ఒక వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బిజెపిని నిలువరించారు. అయితే ఇప్పటికిప్పుడు కాకపోయినా.. ఏపీలో మాత్రం బిజెపి బలపడేందుకు తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. అది కూడా లోకేష్ ద్వారా వర్కౌట్ చేయాలన్నది ప్లాన్‌గా తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని మోదీ నారా లోకేష్‌కు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేకంగా సమావేశాల్లో లోకేష్ ప్రస్తావన తీసుకొస్తున్నారు. పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించి చర్చలు జరుపుతున్నారు. మొన్నటికి మొన్న యోగాంధ్రా వేడుకల్లో లోకేష్ ను ఆశీర్వదించారు. అయితే గతంలో చాలా రాజకీయ పార్టీలు, నేతల విషయంలో ప్రధాని మోదీ ఇలానే వ్యవహరించారు. చాలా చనువు తీసుకున్నారు. అటు తరువాత వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బిజెపి నుంచి వారికి రాజకీయ ఇబ్బందులు ఎదురయ్యాయి. మహారాష్ట్రలో శివసేన ఠాక్రే ఫ్యామిలీకి, ఉత్తరప్రదేశ్లో బీఎస్పీ మాయావతి, కర్ణాటకలో జేడిఎస్ దేవే గౌడ, తమిళనాడులో అన్న డిఎంకె, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, బీహార్లో నితీష్ కుమార్ వంటి వారిని ఇలానే దగ్గర తీసుకొని దెబ్బేశారు. ఇప్పుడు కూడా లోకేష్ విషయంలో అటువంటి పరిస్థితి ఉంటుందన్న టాక్ ప్రారంభం అయింది.చంద్రబాబు ఉన్నంతవరకు నో డౌట్. ఆయన విషయంలో బిజెపి క్రాస్ చేసే అవకాశం లేదు. ఆ చాన్స్ కూడా ఆయన ఇవ్వరు. ఎందుకంటే చంద్రబాబు గురించి బిజెపికి తెలుసు. అందుకే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా లోకేష్ తో సఖ్యతగా ఉన్నారు బిజెపి పెద్దలు. ఒకవేళ భవిష్యత్తులో బిజెపి గ్రాఫ్ తగ్గినా లోకేష్ సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ గ్రాఫ్ పెరిగినా ఏపీలో అదే లోకేష్ ద్వారా.. అధికార పంపకాలు చేయాలని చూస్తున్నారు. భవిష్యత్తులో లోకేష్ ని సీఎంగా చేయడానికి బిజెపి నుంచి అభ్యంతరం రాదు. కానీ అటు తరువాత మాత్రం పెద్ద ఎత్తున ఆ పార్టీ పావులు కదుపుతుంది. మహారాష్ట్ర ఎపిసోడ్లో అదే జరిగింది. త్వరలో లోకేష్ కు టిడిపి పగ్గాలు అప్పగించాలని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపి మొత్తం లోకేష్ కంట్రోల్లోకి వెళ్తుంది. అందుకే కమలనాథులు ముందుగానే జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. మరి వారి ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

- ప్రొహిబిషన్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ కే.అన్నపూర్ణ



**అనంతపురం - సూర్య వాస్తవం, జూన్ 25:** జూన్ 26 వ తేదీ జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ వి.చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు సి.ఐ కే అన్నపూర్ణ ఆధ్వర్యంలో కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్ళను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారు తుందని, వాటికి దూరంగా ఉండాలని తెలియజేశారు.

## నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం

- సాకే నరేష్




**అనంతపురంక్రైం - సూర్యవాస్తవం, జూన్ 25:** బిసి రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తోందని తెలిపారు రాష్ట్రంలో ఎలాంటి ఉపాధి లేక యువత ఒక కోటి యాభై ఆరు లక్షల మంది ఉన్నారని, ప్రతి జిల్లాలోనూ 3 నుంచి 5 లక్షల వరకు ఏ పని లేక ఖాళీగా ఉన్నారు, వీరిలో అత్యధికంగా ఉన్నత చదువులు చదివిన వారే ఉన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇవ్వడంతో ఎంతో ఆశతో లక్షలాది రూపాయలు అప్పులు చేసి నిరుద్యోగులు కోచింగులు తీసుకొని ఉద్యోగాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు, ఉద్యోగాలు లేక వయసు మీద పడడంతో పెళ్లిళ్లు కాక నిరాశతో మిగిలిపోతున్నారు, ప్రభుత్వం మాత్రం జాబ్ క్యాలెండరు విడుదల చేయకుండా అన్యాయం చేస్తోందని నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, వడ్డెర సంఘం కార్యదర్శి గోపాల్, బీసీవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, బోయ సంఘం నరేష్, కటిక సంఘం మధు, యువజన నాయకులు విష్ణు, మహేష్, రాజేంద్ర, వన్నూర్ స్వామి, కార్తీక్, అంజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్.ఎల్.ఎం శిక్షణకు అందరూ హాజరయ్యేలా చూడండి



**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూన్ 25:** ఎఫ్.ఎల్.ఎం శిక్షణకు మండలంలోని ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యేలా చూడాలని సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారులకు సూచించినట్లు సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర రావు తెలిపారు. మండల కేంద్రమైన సిద్ధవటం స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా విద్యార్థుల నమోదు శాతం ఎంత ఉందని ఎంఈఓ ను అడిగి తెలుసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి, మిత్ర కిడ్స్, విద్యార్థులందరికీ అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా అని ప్రశ్నించగా ఎలాంటి కొరత లేదని ఎంఈఓ లు వివరించారు. పాఠశాలలో హెడ్ టీచర్స్‌లు, ప్రధానోపాధ్యాయులు బ్యాంక్ అకౌంట్లను చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పద్మజ, అరుణ, సీఆర్పీలు, పాల్గొన్నారు.

## పామిడి నగర పంచాయతీ వాలంటరీ విభాగానికి ప్రెసిడెంట్‌గా నాగశివ యాదవ్



**పామిడి - సూర్య వాస్తవం, జూన్ 25:** తాడేపల్లి వైయస్సార్సీపి కేంద్ర కార్యాలయం నుండి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు నాగశివ యాదవ్‌ను, పామిడి నగర పంచా యతీ వాలంటరీ విభాగానికి ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ప్రత్యేకమైన ధన్య వాదాలు తెలుపుకుంటున్నాను. నా పదవికి బాధ్యతతో పనిచేస్తానని తెలియజేస్తూ అలాగే నాకు ఈ అవకాశాన్ని కల్పించిన అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డికి, పెమ్మక చెన్నకేశవరెడ్డికి, టౌన్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి అన్నకి, వైయస్సార్సీపి నాయకులందరికీ, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను

## సింగయ్య మరణం

# ముమ్మాటికి జగన్ చేసిన హత్యే

- ఒక దళితున్ని బలి తీసుకొని మళ్లీ బుకాయిస్తున్నాడు
- జగన్‌కు అసలు నైతిక విలువలు ఉన్నాయా
- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 25:** పల్నాడు జిల్లాలో జరిగిన సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యేనని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సింగయ్య మృతి విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యల మీద ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉనికి కోసం బల ప్రదర్శనలు చేస్తూ రాష్ట్రంలో సొంత పార్టీ కార్య కర్తలను కూడా జగన్ బలి తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అనుమతులు లేవని ముందే చెప్పినప్పటికీ వినకుండా ఏదో ఒక అలజడి సృష్టించాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పల్నాడు జిల్లాలో జగన్ కు కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారని కానీ ఆయన ఇతర ప్రాంతాల నుంచి కార్యకర్తలను తీసుకొచ్చి ఒక బల ప్రదర్శనకు దిగారన్నారు. అనుమతులు లేకుండా వేలమందితో ర్యాలీ చేశారని దాని ఫలితంగానే జగన్ వాహనం కింద సింగయ్య పడ్డారన్నారు. తాను చేసిన తప్పు ఒప్పుకోకుండా ప్రభుత్వంతో పాటు పోలీసుల మీద బురద జల్లుతున్నారన్నారు. 679 మంది పోలీసులను జగన్ పర్యటనలో బందోబస్తుకు పెట్టారన్నారు. బెట్టింగులు కట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారంటే జగన్ ను ఏమనాలో తెలియడం లేదన్నారు. ఆయనకు ఎక్కడ శవం కనిపిస్తే అక్కడ వాలిపోతారని దాన్ని రాజకీయం చేసేందుకు ఎన్నో కుట్రలు పన్నుతారని దగ్గుపాటి విమర్శలు చేశారు. జగన్ హయాంలో దళితులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని ఇప్పుడు సింగయ్య లాంటి దళిత సోదరుడు మరణిస్తే దానికి నైతిక బాధ్యత వహించకుండా బుకాయిస్తున్నాడన్నారు. గతంలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్ పర్యటనలను ఏ విధంగా అడ్డుకున్నారో ప్రజలంతా చూశారన్నారు. సింగయ్య మృతిని జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# వడ్డీ రాకాసురులపై చర్యలు తీసుకోండి

- గౌరీని శారీరకంగా వేధించిన వడ్డీ వ్యాపారస్తులపై కేసు నమోదు చేయాలి
- అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి




**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 25:** మదనపల్లెలో వేళ్లూనుకు పోయినా అనధికార వడ్డీ రాకాసురులపై చర్యలు తీసుకుని, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో ఇరుక్కున్న మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. మదనపల్లె రెడ్డీస్ కాలనీకి చెందిన బాధితురాలు గౌరీ ని వడ్డీ వ్యాపారస్థుల వేధింపులు తట్టుకోలేక మంగళవారం మీడియా ముందుకు తన బాధను వెళ్లగక్కి తనకు చావే శరణ్యమని విలపించడంతో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి స్పందించారు. బుధవారం మదనపల్లెకు చేరుకుని బాధితురాలు గౌరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు జరిగిన అన్యాయం పై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్‌లో బాధితురాలు గౌరితో పాటు ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్థిక అవసరాలు ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్న కొంతమంది వడ్డీ వ్యాపారస్తులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, వారి వద్ద నుంచి అసలు కన్నా వడ్డీలను 10 రెట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మదనపల్లెలో గౌరీ అనే మహిళకు స్థానికంగా ఉంటున్న మాజీ సైనికుడు ఏకాంబరరెడ్డి, ఆదివేని ఆనంద్, అతని భార్య మంజుల, బండి హరినాథ్ తక్కువ మొత్తంలో డబ్బులు ఇచ్చినప్పటికీ ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని వేధింపులకు గురి చేయటం, కాలి చెక్కులు కోర్టులో వేయడం బాధా కరమన్నారు. అసలు తీర్చేసినా ఇంకా డబ్బులు ఇవ్వాలని వేదించడం, డబ్బులు కట్టలేని పక్షంలో వ్యభిచారం చేసి మా డబ్బులు చెల్లించమని పురిగొల్పుతూ అనుమానించడం, అంతుచూస్తామని బెదిరించడం, విచారకరమన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో నిందితులకు మరింత ఊతమిచ్చినట్లుఅయ్యింది అన్నారు. దీంతో బాధితురాలు మీడియా ముందుకు వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గోడును వెల్లబోసుకుందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఏమి చేస్తోందని నిలదీశారు. ఇక మహిళలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మైక్రో సంస్థలు ఆగడాలు మితి మీరుతున్నాయని, మహిళల్నే టార్గెట్ చేస్తూ మళ్లీ జూలు విదుల్చుతున్నారని తెలిపారు. కొంతమంది వడ్డీ వ్యాపారస్తులు వెయ్యికి వెయ్యి వడ్డీ వసూలు చేస్తున్నారని, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారాలు నడుస్తున్నా, అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరించడం బాధాకర మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళలకు రక్షణగా నిలవాలన్నారు. మదనపల్లెలో జరిగిన అరాచకంపై సబ్ కలెక్టర్ స్పందించి సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలు గౌరీ వద్ద ఉన్న ఆధారాలను తీసుకొని వాటిపై సమగ్ర విచారణ జరిపి అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చారా, వారికి ఎక్కడి నుంచి ఆ డబ్బులు వచ్చాయి, అన్న కోణంలో సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. బాధితురాలికి ఐద్వా అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు. ఇలాంటి బాధితులు ముందుకు రావాల్సిన అవసరత ఉందన్నారు. ఈ సమావేశంలో బాధితురాలు గౌరి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు, జిల్లా ఇన్చార్జ్ సాయిలక్ష్మి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, చిత్తూరు జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, మదనపల్లె పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి ప్రసన్న, షాహినా పాల్గొన్నారు.

## వ్యాక్సిన్‌పై వైద్య విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి



**చెన్నూరు - సూర్య వాస్తవం, జూన్ 25:** వైద్య విద్యార్థులు వ్యాక్సినేషన్‌పై అవగాహన పెంపొందించు కోవాలని ముఖ్యంగా బాలింతలు, గర్భవతులు, చిన్నపిల్లల విషయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ మెలుకువతో వ్యాక్సిన్ అందించాలని రూరల్ హెల్త్ ట్రైనింగ్ మెడికల్ అధికారి డాక్టర్ జె.సాయిచందన, డాక్టర్ కె.విజయ్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం వారు చెన్నూరు కొత్త గాంధీ నగర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రంలో, బాలింతలను, గర్భవతులను పరీక్షించడంతో పాటు చిన్నపిల్లలకు వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా కడప రిమ్స్‌లో చదువుతున్న వైద్య విద్యార్థులు ట్రైనింగ్( హౌస్ సర్జన్) అవగాహన, శిక్షణ లో భాగంగా చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి సచివాలయం - 3 పరిధిలోని చెన్నూరు కొత్త గాంధీ నగర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రంకు రావడం జరిగింది. కాగా వైద్య విద్యార్థులకు వైద్యులు ఏఏ జబ్బులకు ఏ ఏ వ్యాక్సినేషన్ ఉపయోగిస్తారు, వ్యాక్సిన్ అయినప్పటి నుండి, ఉపయోగించే వరకు, వ్యాక్సిన్ యొక్క అవసరం, దాని యొక్క ఉపయోగం వాడే విధానం దానిని ఏ విధంగా ఏ యే వాతావరణంలో భద్రపరచాలి వంటి విషయాలపై వైద్య విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది. అదేవిధంగా గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఏ విధంగా వ్యాక్సిన్ అందించాలో ఏఏ మోతాదులో అందించాలో ఆరోగ్య ఉప కేంద్రంలో వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వెంకటమ్మ, లక్ష్మీదేవి, రెడ్డమ్మ, సూపర్వైజర్లు షణ్ముగం, మోహన్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అయ్యవారమ్మ, శాంతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రమే మన లక్ష్యం

- సిద్ధవటం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూన్ 25:** డ్రగ్స్ రహిత ఆంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యమని సిద్ధవటం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్ధవటం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకాద్రవ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రగ్స్ ను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరుగు తుందన్నారు. అలాగే వారిలో అవగాహన కల్పించేందుకు వ్యాస రచన పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. డ్రగ్స్ వల్ల చాలా మంది యువత తమ పచ్చటి జీవితాలను కోల్పోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో ఉందన్నారు. వ్యాస రచన పోటీలలో ప్రథమ బహుమతి కే. లక్ష్మీ నరసమ్మ, ద్వితీయ బహుమతి జి.లక్ష్మీ ప్రసన్న, తృతీయ బహుమతి మోహన్ మంజులకు సీఐ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై అమీర్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### మానవ హక్కుల సంఘం
## ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అనిస్ అహ్మద్



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 25:** మానవ హక్కుల సంఘం అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా తనకు నియమించి నట్లు చిన్న మండెం మండలానికి చెందిన ప్రముఖ డాక్టర్ షేక్ అనిష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని నాంపల్లి ఏరియాలో ఉన్న మానవ హక్కుల సంఘ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక షా మహమ్మద్, మానవ హక్కుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అమీన్ పీరా చేతుల మీదుగా నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తన వంతు పోరాటం సాగిస్తాని, అన్నమయ్య జిల్లాలో ఎక్కడ అన్యాయం జరిగినా చట్టపరంగా పోరాటం సాగిస్తామని అని చెప్పారు. భవిష్యత్తులో మానవ హక్కుల ఉల్లంఘనకు ఎక్కడచోటు చేసుకున్న చోట ప్రజలకు న్యాయం అందించడానికి మీ ముందుండి సహాయక సహకారాలు అందించడమే కాకుండా వాళ్లకు న్యాయం జరిగేలా చూస్తామని మా ప్రాంతంలో ఉండే మానవ హక్కు ల బాధితులు ఎవరన్నా ఉంటే మాతో సంప్రదించడం వచ్చు అని ఆయన అన్నారు.

### వాసవి కళాశాల విద్యార్థినికి
## జాతీయ స్థాయి పరీక్ష జిపిఎటిలో 809వ ర్యాంక్



**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూన్ 25:** వాసవి కళాశాల విద్యార్థినికి జాతీయ స్థాయి పరీక్ష జిపిఎటి - 2025 లో 809 వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. మండలంలోని మాధవరం-1 శివారులో ఉన్న వాసవి ఇన్‌స్టిట్యూట్ లో బుధవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థి పి. శ్వేత జాతీయ స్థాయి పరీక్ష జిపిఎటి -2025లో 809 సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంక్ సాధించడం వల్ల స్టైఫండ్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు యూనివర్సిటీలో పొందవచ్చునన్నారు. అలాగే ఫార్మసీ కంపెనీలలో మంచి ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రదీప్ కుమార్ ఎన్ఎస్ఎస్ అధికారి బి.జగదీష్ బాబు, ఉపాధ్యాయులు ర్యాంకు సాధించిన విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

## మారేష్ కుటుంబానికి
## మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**ఆదోని - సూర్య వాస్తవం, జూన్ 25:** ఆదోని పట్టణంలోని స్థానిక ఇంద్రనగర్ ఎరుకల కాలనీలోని నివసిస్తున్న మారేష్, భారతి దంపతుల కుమారుడు అభిరామ్ (7) సంవత్సరాలు అబ్బాయికి మంగళవారం సాయంత్రం ఇంట్లో పాము కరిచి చనిపోయాడన్న విషయం తెలుసుకున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆ ఏరియాలో ఉన్న కౌన్సిలర్ చలపతికి ఫోన్‌చేసి వెంటనే వెళ్లి ఆ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించమని చెప్పారు. తన ఆదేశం మేరకు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు. చలపతి. ఎరుకల నాగేష్, ఆటో లక్ష్మన్న, బైలర్ నాగరాజు, జోలాపురం రాజు, మనీ, బండేప్ప, ఉప్పరి నారాయణ, సూరి, పరమేష్, బోయ తిమ్మప్ప, హిట్లర్, వడ్డే సతీష్, గొల్ల రాజు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాటర్ సప్లై పైపు లీకేజీ పనులు తనిఖీ

### - మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, డి.ఈ.ఈ హేమచంద్ర



**గుత్తి - సూర్యవాస్తవం, జూన్ 25:** గుత్తి పట్టణం, వాటర్ సప్లై పైపు లీకేజీ పనులను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, డి.ఈ.ఈ హేమచంద్ర ఈ సందర్భంగా తనిఖీలలో భాగంగా సిబ్బంది ద్వారా వార్డులలో నీరు వృదా కాకుండా పైపు లీకేజీలు ఉన్న ప్రాంతాలలో త్వరితగతిన పనులను పూ ర్తిచేసి నీటి సరఫరా సమస్యలు లేకుండా చేయాలని ఆదేశించారు. మోటార్ రిపేరిలు ఎప్పటికప్పుడు చేయిం చేలా చర్యలు చేపట్టాలని వాటర్ ట్యాంక్ లు ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తూ నీటి సరఫరా జరిగేలా సూచనల ప్రకారం సిబ్బంది ద్వారా పనులు చేయించాలని అమె నీటి సెక్రెటరీకి సూచించారు. కాలువల సమీపము ఉన్న నీటి పైపులలో నీటి కలుషితం కాకుండా జాగ్రతక చర్యలు చేపట్టాలని వర్కర్స్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ హరికిరన్, అమెనీటి సెక్రెటరీలు, మున్సిపల్ సిబ్బంది, వర్కర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యామిత్ర కిట్లు పంపిణీ చేసిన గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి - సూర్య వాస్తవం, జూన్ 25:** పామిడి పట్టణం తలవాల కట్ట వద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వేపల్లి రాదాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్బంగా ఇక్కడ వున్న నా తమ్ముళ్లు నా చెల్లెల్లు అందరు బాగా కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు, మీ గురువులకు మంచి పేరు తీసుకురావాలని గుమ్మనూరు ఈశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### భార్య చేతిలో భర్త హతం..
# ఆరు గంటల్లోనే హత్య కేసు ఛేదింపు

- ఇద్దరి అరెస్టు హత్యకు ప్రియుడిని ఉసిగొల్పిన భార్య - వివాహేతర సంబంధానికి అడ్డు ఉండకూడదనే హత్య
- ఇందులో స్వయాన భార్య, ఆమె ప్రియుడే నిందితులు
- జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో వివరాలు వెల్లడించిన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు







**అనంతపురం క్రైం - సూర్యవాస్తవం, జూన్ 25:** అనంతపురం జిల్లాలో హత్యల పరంపర ఆందోళన కలిగిస్తోంది. రోజుకో హత్య కేసు జరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.మంగళవారం రోజునే అనంతపురం నగర శివారులో బళ్లారి రోడ్డుకు సమీపంలో శివానంద అనే యువకుడు హత్యకు గురయ్యాడు. తాజాగా మరో వ్యక్తి భార్య చేతిలో హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. అనంత పురం మండలం అక్కంపల్లి - రాదానపల్లి మధ్యలో కుమ్మర నరసాపురం సురేష్ బాబు హత్యకు గురయ్యాడు. దీనిపై అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. కుమ్మర నరసాపురం సురేష్ బాబు స్థానిక కళ్యాణదుర్గం రోడ్ లో హోటల్ పెట్టుకొని జీవనము సాగిస్తున్నాడు. ఇతని భార్య అనిత స్థానిక మొదటి రోడ్‌లో ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తోంది. ఈమెకు 2 నెలల కిందట బాబా ఫకృద్దీన్‌తో పరిచయము ఏర్పడింది. ఇతను 10 సంవత్సరాల కిందట స్వగ్రామమైన గౌరదిండ్ల నుండీ స్థానిక సదాశివ కాలనీకి కుటుంబం సహా మకాం మార్చాడు. పండ్లు బండిలో వేసుకుని ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో... అనిత, బాబా ఫకృద్దీన్ ల మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. భర్త సురేష్ బాబుకు అనుమానం కల్గింది. భార్యను తాగొచ్చి వేధించేవాడు. తనను అనుమానిస్తుండటం. అదే సాకుతో వేధిస్తుండటం, తదితర విషయాలన్నీ ప్రియుడితో వివరించింది. వారి వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్న భర్తను ఎలాగైనా కడతేర్చితే ఇద్దరం సంతోషంగా ఉండొచ్చని ప్రియుడికి చెప్పింది. ప్రతీరోజు రాత్రి హోటల్ మూసేసి తన భర్త టూవీలర్ పై ఇంటికొస్తారని... ఆ సమయంలో అతనిని చంపితే సరిపోతుందని కుట్ర పన్నింది. ఇందుకు సరే అని అంగీకరించిన బాబా ఫకృద్దీన్ నిన్న వ్యాపారం నిమిత్తం మార్తాడు గ్రామానికి, వెళ్లాడు. ఆసందర్భంగా ఇతనికి అనిత ఫోన్ చేసి ఎలాగైనా ఈరోజు చంపాలని సూచించింది. అంతే... రోజువారీ చర్యలలో భాగంగా హోటల్ మూసేసి రాత్రి 11 గంటల ప్రాంతంలో నివాస ప్రాంతమైన సదాశివకాలనీకి సురేష్ బాబు టూవీలర్ పై బయల్దేరాడు. మార్గ మధ్యలో బాబా ఫకృద్దీన్ అటాక్ చేశాడు. అక్కడే అందుబాటులో ఉన్న ఖాళీ సీసా సురేష్ బాబుపై విసిరాడు. టూవీలర్ సహా కిందకు పడిన అతనిపై బాబాఫకృద్దీన్ దాడి చేశాడు. వెంట తీసికెళ్లిన స్క్రూడ్రైవర్ తో పొడిచి ఆతర్వాత బండరాయితో బాది చంపాడు. అక్కడి నుంచి పరారయ్యాడు.

**జిల్లా ఎస్పీ పి.జగదీష్ సీరియస్ : జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి వెంటనే ఛేదించాలని ఆదేశాలు:** అక్కంపల్లి సమీపంలో హత్య జరిగిందనే విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ పి.జగదీష్ సీరియస్ అయ్యారు. వెంటనే ఛేదించాలని ఆదేశించారు. అంతేకాకుండా... ఎస్పీ నే స్వయాన పర్యవేక్షించి కేసు ఛేదింపునకు కృషి చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సి.ఐ శేఖర్ ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఇద్దరు నిందితులను పక్కా రాబడిన సమాచారంతో కేవలం ఆరు గంటల్లో అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో హత్య కేసు ఛేదించిన సి.ఐ శేఖర్ బృందాన్ని అభినందించారు.

# పాఠశాలల అధిక ఫీజులకు అడ్డుకట్ట వేయాలి

### - కాంగ్రెస్ పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్

**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 25:** పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను ఏడాదికేడాది పెంచుతూ పోతుండడం ఫీజుల పెంపుపై విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం కూడా ఇవ్వడం లేదని కాంగ్రెస్ పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ అన్నారు. జిల్లాలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతూ బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఇఓ అందుబాటులో లేకపోవడంతో ఏడి రవికుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాబా సర్దార్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగుతుంది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వేలకువేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆయన చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ ఖాదర్ ఖాన్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ భాష, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ చైర్మన్ అమీర్, చిన్నమండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానం కాదు అనురాగం ముఖ్యం

### - ఐసీడీఎస్ పీడీ నాగమణి
### - మనస్పర్థలతో భర్తకు దూరమై న్యాయం కోసం డీవీసీకి వచ్చిన ఓ భార్యకు కౌన్సెలింగ్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 25:** భార్య, భర్తల మధ్య అనుమానం కాకుండా అనురాగం ఉంటే అటువంటి బంధం మరింత బలపడుతుందని ఐసీడీఎస్ పీడీ నాగమణి అన్నారు. ఇద్దరు పిల్లలు పుట్టక వివాహేతర సంబంధం దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. భర్త, ఇద్దరు పిల్లలకు దూరంగా ఉంటున్న ఓ అభాగ్యురాలు న్యాయం కోసం శక్తి సదన్ ఆఫీసు అసిస్టెంట్ గౌరీ సహకారంతో ఐసీడీఎస్ అనుబంధం గృహ హింస నిరోధక(డీవీసీ) విభాగానికి రాగా.. పీడీ కౌన్సెలింగ్ ఇచ్చారు. డీవీసీ లీగల్ కౌన్సిలర్ నర్మద, సఖి మేనేజర్ శాంతామణి, ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా.. పీడీ అక్కడికి చేరుకున్నారు. బాధితురాలితో మాట్లాడారు. ఆమె వివరాలు రాబట్టారు. వివాహేతర సంబంధాలు మంచిది కాదని సూచించారు. పచ్చని సంసారాల్లో వివాహేతర సంబంధాలు ఎలా చిచ్చుపెట్టి కూల్చేస్తాయో వివరించారు. పిల్లల భవిష్యత్ కోసం దంపతులు పాలు, నీళ్లలా కలసి ఉండాలని, ఎన్ని మనస్పర్ధలు వచ్చినా విడిపోకుండా ఉండాలని హితవు పలికారు.

## అత్యాధునిక టెక్నాలజీతో ట్రాఫిక్ నియంత్రణ

### - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం - సూర్య వాస్తవం, జూన్ 25:** ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 2 - బుల్లెట్ వాహనాలు, 20 - అపాచి వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ఆఫీసు మంగళగిరి నుండి వచ్చిన ఈ వాహనాలను సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించా రన్నారు. జిల్లాలోని కర్నూలు ట్రాఫిక్ పియస్‌కి, ఎమ్మిగనూరు ట్రాఫిక్ పియస్‌కి, ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లకు ఈ వాహనాలు కేటాయిస్తున్నా మన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నా మన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు.



## అన్ని శాఖల సమన్వయంతోనే
# రాష్ట్ర ఆదాయం పెంపు సాధ్యం

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 25:** అన్ని శాఖల సమన్వయంతోనే రాష్ట్ర ఆదాయం పెంపు సాధ్యమని పన్నుల పరిధిలోకి రాకుండా తప్పించుకునే వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం స రాయచోటి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర జిఎస్టి ఆదాయంపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ జీఎస్టీ అధికారి, జిల్లా పంచాయతీ శాఖ మునిసిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లు ఆడిట్ శాఖ తదితర శాఖల వారు జిఎస్టి ఆదాయాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసర మయ్యే ఆదాయాన్ని పన్నుల ద్వారా సమీకరిస్తుందన్నారు. రాష్ట్ర జిఎస్టి ఆదాయాన్ని పెంచడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిఎస్టి శాఖ వారికి అవసరమైన వివరాలను ఇతర శాఖల అధికారులు చట్టపరిధికి లోబడి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘా స్వరూప్, నైడియా దేవి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా జిఎస్టి శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్ర విజయవంతం

- బెంగళూరుకు చేరుకున్న హాజీలు - స్వాగతం పలికిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా




**మదనపల్లి - సూర్యవాస్తవం, జూన్ 25:** ముస్లిం మైనార్టీలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్ర విజయ వంతంగా ముగించు కుని హాజీలు తిరిగి మంగళవారం అర్ధరాత్రి బెంగళూరు ఎయిర్ పోర్ట్ కు చేరు కున్నారు. ఈ సందర్భంగా హాజీలకు మదనపల్లి శాసనసభ్యులు యం షాజహాన్ బాషా ఘన స్వాగతం పలికి వారికి ప్రత్యేకంగా విందు ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాసన్‌భాష, హాజకమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, మెంబర్లు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలపై అవగాహన సదస్సు



**గార్లదిన్నె - సూర్యవాస్తవం, జూన్ 25:** గార్లదిన్నె మండలంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, ఫోక్సో చట్టం 2012, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నివారణ చట్టం 1994 టీనేజ్ ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సి.వెంకటేష్ హెచ్ ఈ ఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిరోధించాలంటే లింగ వివక్షతను రూపు మాపాలంటే మహిళలకు భద్రత చట్టాలపై విద్యా హక్కు చట్టంపై అవగాహన ఎంతైనా అవసరం కిశోర బాలికలు సాధికారత సాధించాలంటే లింగ వివక్షతను బాల్యవివాహాలను యుక్త వయసు గర్భధారణలను సమాజంలో నిర్మూలించడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరం ఈ కార్యక్రమంలో యులోకనాథ్ సి హెచ్ ఓ ఏ నాగసత్య ప్రిన్సిపాల్, జే నర్సమ్మ, ఎంపిహెచ్ ఎస్ కే నాగరాజు, ఎం పి హెచ్ ఎ కే చంద్రకళ, ఏఎన్ఎం విద్యార్థునులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యని పరిష్కరించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి - సూర్యవాస్తవం, జూన్ 25:** పామిడి పట్టణం 3వ వార్డు నందు గత కొంత కాలంగా విద్యుత్ పోల్లు, విద్యుత్ తీగల సమస్య ఉందని ఇటీవల పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌కి వార్డు ప్రజలు విన్నవించడం జరిగింది, ఈసందర్భంగా కరెంటు ఏ ఈ, మధుసూదన్ రావు బుధవారం రోజున మూడవ వార్డుకు 20 కరెంటు పోల్స్, కరెంటు తీగలు మంజూరు చేయడం జరిగింది, ఈసందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ వార్డులో పర్యటించి వార్డులో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన ద్రుష్టికి తీసుకుని రావాలని వాటిని కూడా కచ్చితంగా తీరుస్తామని గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. అనంతరం వార్డు సభ్యులు మాట్లాడుతూ మా వార్డులో విద్యుత్ సమస్య తీర్చినందుకు గుమ్మనూరు ఈశ్వర్ హృదయపూర్వక ధన్యవాదములు అని తెలిపారు. ఈకార్యక్రమంలో పామిడి పట్టణ, మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ 2024
# ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం

- మున్సిపల్ పరిధి 14.20 నుండి 37.26 చదరపు కిలోమీటర్లకు పెంపు
- సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటిగా మదనపల్లి



**మదనపల్లి - సూర్యవాస్తవం, జూన్ 25:** మదనపల్లె మున్సిపల్ సేవలు పొందేందుకు అడ్డంకిగా ఉన్న నిబంధనలు తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లె ను సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటి మాస్టర్ ప్లాను కు ఆమోదం తెలిపింది. దీనిని ధ్రువీకరిస్తూ మున్సిపల్ అధికారులు నోటీసు ద్వారా ప్రకటించారు. దీంతో ఇప్పటిదాకా కొనసాగిన గందరగోళ పరిస్థితులకు తెర పడింది. 2024లో ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. ఇక నుంచి బసినికొండ - కదిరిరోడ్డు వంద అడుగులు, రాష్ట్ర హైవేగా వంద అడుగులతో శాస్త్రీ వీధి, నాలుగు జోన్లుగా విభజన.

**పెరగనున్న ఆదాయం :** మదనపల్లె మున్సిపాలిటీ పరిధిని నాలుగు జోన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. కమర్షియల్, రెసిడె న్షియల్, మిక్స్, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్లను తీసుకొచ్చింది. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్లో కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులు, కార్యాలయాలు, భూములు, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రులుటాయి. వాటికి మూడుజోన్ల నుంచి మిన హాయింపు ఉంటుంది. 2044 వరకు ఈ మాస్టర్ ప్లాన్ అమలులో ఉంటుంది.

**కమర్షియల్ ప్రాంతాలు :** అమ్మచెరువుమిట్ట నుంచి వై జంక్షన్–కదిరిరోడ్డు, గోళ్లపల్లె రింగ్ రోడ్డు, కదిరి రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, బెంగళూరురోడ్డు, సీటీఎం రోడ్డు, బర్మావీధి, గాంధీ రోడ్డు, నిమ్మనపల్లె రోడ్డు, పుంగనూరు రోడ్డు,

**మదనపల్లె పట్టణం :** అప్పారావు వీధి, అవెన్యూ రోడ్డు, చిత్తూరు బస్టాండ్ నుంచి శాస్త్రీ వీధి, తట్టివారిపల్లె జంక్షన్ నుంచి వై జంక్షన్ వరకు కమర్షియల్ ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ కమర్షియల్ లెక్కలోనే అనుమతులు మంజూరు చేస్తారు.

**మిక్స్ ప్రాంతాలు :** కమర్షియల్, రెసిడెన్షియల్ కలిపిన ప్రాంతాల్లో చౌడే శ్వరీనగర్ కు చెందిన ఐదు వీధులు, రాజానగర్, రామిరెడ్డి లేఅవుట్, రెడ్డీస్ కాలనీ మెయిన్ రోడ్డు, నక్కలదిన్నె నుంచి రామిరెడ్డిగారిపల్లి రోడ్డు, ప్యారా నగర్, కోటవీధి, అగర్తలవీధి సందులు, వివేకానంద నగర్, హెచ్పీగ్యాస్ వీధి, లక్ష్మీనగర్ కాలనీ, ఎన్ వీఆర్ లేఅవుట్ మెయిన్ రోడ్డు ఉన్నాయి. ఈ ప్రాం తాలను వాణిజ్య, నివాస ప్రాంతాలుగా గుర్తించి ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పై రెండు అంశాలకు సంబంధించిన ప్రాంతాలను మినహాయిం చగా మిగిలిన ప్రాంతాలన్నీ నివాస ప్రాంత జోన్ పరిధిలోకి వస్తాయి.

**ఇక వంద అడుగుల రోడ్లు :** మాస్టర్ ప్లాన్లో మదనపల్లె పట్టణ నడిబొడ్డున వెళ్లే రహదారులను విస్తరిస్తారు. ఇప్పటిదాకా 40 అడు గులతో ఉన్న శాస్త్రీ వీధిని వంద అడుగుల రోడ్డుకు విస్తరించి రాష్ట్ర హైవేగా మార్చారు. చిత్తూరు బస్టాం డ్ నుంచి శాస్త్రీవీధి, రాగిమాను నుంచి మున్సిపల్ పరిధి వరకు ఈ రహదారి ఉంటుంది. అలాగే 60 అడుగుల రహదారులుగా ఉన్న అవెన్యూరోడ్డు, సీటీ ఎంరోడ్డు, గాంధీరోడ్డును వంద అడుగుల రోడ్డుగా మార్చారు.

**మరిన్ని లాభాలు :** పొన్నటిపాలెం లోని సర్వే నంబర్ 425 లో మామిడి కుండగా ఉన్న దాన్ని రెసిడెన్షియల్ చేశారు. పాత మాస్టర్ ప్లాన్లోని బీకేపల్లిలోని సర్వే నంబర్ 280లో ఉన్న స్టేడియంను గురివిచెట్టిచెరువుగా మార్చారు. అంకిశెట్టిపల్లి, చిప్పిలి, కోళ్లబైలు, పప్పిరెడ్డిగారిపల్లి, బసినికొండ, కొంత రూరల్ ప్రాంతాన్ని కొత్తగా మాస్టర్ ప్లాన్లో విలీనం చేశారు. గత మాస్టర్ ప్లాన్ అనుమతి పొందిన మేరకు మున్సిపల్ పరిధి 14.20 చదరపు కిలోమీటర్లు కాగా కొత్త ఆమోదం ప్రకారం విస్తీర్ణం 37.26 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించండి

- రంగయ్య తిరుపతిరావు డిమాండ్



**తాడిపత్రి - సూర్యవాస్తవం, జూన్ 25:** తాడిపత్రి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను త్వరత్వరగ పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారం పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు బి. నారాయణప్ప అధ్యక్షతన అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అగ్రిగోల్డ్ బాధ్యులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి. రంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల అంశాన్ని ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం, అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు వేసి, అగ్రిగోల్డ్ ఆస్తులను వెరిఫికేషన్ చేస్తూ, స్పెషల్ కోర్టు వేయడానికి ప్రయత్నం చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నాం. అయితే గతంలో 11 సంవత్సరాల క్రిందట కమిటీలు వేశారు. కానీ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కారం కాలేదు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి కమిటీలకే పరిమితం కాకుండా జాప్యం చేయకుండా ఒక కాలపరిమితి నిర్ణయించి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యం చేసిన అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి ఉద్యమానికి సమయతమవు తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గుడికి సంబంధించిన భూమి కబ్జా చేసే ప్రయత్నం


- పోలీసుల రాకతో సర్దు మునిగిన గొడవ



**హిందూపురం - సూర్యవాస్తవం, జూన్ 25:** పట్టణంలోని డీబీ కాలనీలో ఇరువర్గాల మధ్య స్థల వివాదం చోట చేసుకుంది. పట్టణంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం సమీపంలో ఉన్న రెండెకరాల భూమికి సంబంధించి కొందరు ప్రైవేట్ వ్యక్తులు మాదే భూమంటూ కోర్టులో కూడా మాకే అయిందని ఇటీవల ఆ 1 స్థలంలో ఉన్న షాపులు తొలగించడానికి ప్రయత్నించారు. అయితే ఆరోజు అక్కడ షాపుల్లో ఉన్న వారు వ్యతిరేకించారు. అయితే బుధవారం ఎండోమెంట్ ఈఓ నాగేంద్ర. ఆ స్థలంలో షాపుల్లో బాడుగకు ఉన్న వారు రెండెకరాల స్థలానికి కంచె వేయడానికి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న బద్రినాథ్ అనే వ్యక్తితోపాటు మరికొంతమందితో అక్కడికి చేరుకుని ఈ స్థలం మేం కొనుగోలు చేశామని, ఇది ఆలయానికి సంబంధించిన భూమికాదంటూ మీరు కంచె ఎలా వేస్తారని ఎండోమెంట్ ఈఓను ప్రశ్నించారా. అయితే దీనిపై ఎండోమెంట్ ఈఓ మాట్లాడుతూ ఈ స్థలం ఎండోమెంట్ దేనని నానెప్ప అనే వైద్యుడు ఆలయానికి దానంగా ఇచ్చాడన్నారు. అయితే ఇందులో కొంతమంది కోర్టుకు వెళ్లి తప్పుడు పత్రాలు సృష్టించి దేవుని భూమిని లాగేయడానికి చూస్తున్నారు. ఇక్కడ గత 30ఏళ్లకు పైగా రోడ్డుపక్కన షాపులు పెట్టు కొని వారు ఆలయానికి బాడుగకూడా చెల్లిస్తున్నారు. ఇది దేవాలయానికి సంబందించిందని చెప్పారు. అయితే సాపుల్లో బాడుగకు ఉన్న వారు మాట్లాడుతూ ఈ స్థలం అనంత పద్మనాభస్వామిదేనని మేము 20 ఏళ్లుగా ఎండోమెంట్ కు బాడుల చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనంతపద్మనాభస్వామి భూమిని కాపాడాలని నినాదాలుచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ప్రైవేట్ వ్యక్తులు, ఎండోమెంట్ అధికారులవద్ద ఉన్న పత్రాలు తీసుకురావాలని అప్పటి వరకు ఇందులో ఎలాంటి పనులుచేయకూడదని సూచించారు. అంతేకాకుండా ఇది సున్నితమైన అంశమని దీనిని ఎవరు దిక్కరించ కూడదంటూ హెచ్చరిం చారు. దీంతో వివాదం సద్యుమణిగింది.


# రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి




**చెన్నూరు - సూర్యవాస్తవం, జూన్ 25:** వరి పంటలో నాణ్యమైన రకాలు యాజమాన్యం పద్ధతులు గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య అన్నారు. బుధవారం మండలంలోని కొక్కరాయపల్లి గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య మాట్లాడుతూ, రైతులకు వరి పటలోని నాణ్యమైన రకాలు వాటి యాజమాన్యం గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా వరి మినీ కిట్స్ ఆర్‌జిఎల్ 7038, ఆర్‌జిఎల్ 7034 రైతులకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా రైతులకు వరి సాగులో మెలుకువలు, యాజమాన్య పద్ధతులు, తక్కువ పెట్టుబడి, ఎక్కువ రాబడి వంటి విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారిని కే శ్రీదేవి మాట్లాడుతూ,మినుము వి బి ఎన్ 7రకాము జొన్న సి ఎస్ వి 41రకాము మినీ కిట్లు ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు సరఫరా చేయబడతాయని తెలియజేశారు. ఈకార్యక్రమం లో ఏ ఈ ఓ. సుధీర్ కుమార్ డి.చరణ్, వి ఏ ఏ కుమార్, కే . రెడ్డి నాగేశ్వరి రైతులు తదితరులు పాల్గొన్నారు.


# నో పాలిటిక్స్ ప్లీజ్ అంటున్న విజయ్..!



ఒకవేళ ప్రజలకు సేవ చేయాలని ఎవరైనా రాజకీయాల్లోకి వస్తే అది పూర్తిస్థాయి ప్రజల మద్ధతుతో చేయాలని అన్నారు విజయ్. బిచ్చగాడు, బేతాళుడు, బిచ్చగాడు 2 సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన విజయ్ ఆంటోని తను తీసే ప్రతి సినిమాను తెలుగు ఆడియన్స్ ముందుకు తెస్తున్నాడు. లేటెస్ట్‌గా అతను నటించిన మార్గన్ సినిమా కూడా తెలుగు రిలీజ్ అవుతుంది.

ఈ నెల 27న రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో విజయ్ ఆంటోని పాల్గొన్నాడు. ఈ క్రమంలో తనకు రాజకీయాల్లో నాలెడ్జ్ లేదని.. రాజకీయాల్లోకి వెళ్లే ఆలోచన అసలు లేదని చెప్పారు. కాస్త ఫేమ్ ఉన్న ప్రతి స్టార్ కూడా రాజకీయాల్లోకి రావడం కామన్ అయ్యింది. ఐతే అక్కడ నిలదొక్కుకునే వారి సంఖ్య తక్కువే అయినా సినిమా టు పాలిటిక్స్ అనేది ఈమధ్య బాగా వినపడుతుంది. ఐతే విజయ్ ఆంటోని ని కూడా రాజకీయాల గురించి అడిగితే.. తనకు అసలు పాలిటిక్స్ మీద అవగాహన లేదని చెప్పాడు. కేవలం ఫేమ్ ఉందని రాజకీయాల్లోకి రావడం కుదరదని అన్నారు. అసలు తనకు రాజకీయాల్లోకి వెళ్లే ఉద్దేశం లేదని.. యాక్టర్స్ అంతా కూడా రాజకీయాల్లోకి రావాలన్న రూల్ లేదని అన్నారు విజయ్ ఆంటోని.


# ఆ హీరోయిన్ వరుస ఆఫర్లతో ఎక్కడా తగ్గట్లేదుగా



సినీ ఇండస్ట్రీలో ఎవరికెప్పుడు అదృష్టం కలిసొస్తుందో ఎవరూ చెప్పలేం. అందుకే ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారని.సినీ ఇండస్ట్రీలో ఎవరికెప్పుడు అదృష్టం కలిసొస్తుందో ఎవరూ చెప్పలేం. అందుకే ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారని. ఒక వారం ఒకరు విన్నర్ అయి స్టార్ గా నిలిస్తే, ఇంకోవారం ఇంకొకరు స్టార్ అవుతారు. ఎవరెప్పుడు, ఎలా స్టార్లుగా మారతారనేది ఎవరూ ఊహించలేం. అలా ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఆ సినిమాలో నటించిన మమిత బైజు. ప్రేమలు సినిమా తర్వాత మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆ సినిమా కంటే ముందు మమిత మలయాళంలో పలు సినిమాలు చేసినప్పటికీ వాటన్నింటితో రాని క్రేజ్ ప్రేమలు సినిమాతో వచ్చింది. కేవలం మలయాళంలో కాకుండా ఆ సినిమా రిలీజైన ప్రతీ భాషలోనూ అమ్మడికి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. అందులో భాగంగానే మమితకు ఆఫర్లు క్యూ కడుతున్నాయి.అంచనాలు పెంచే ఆ ఒక్కటీ రెడీ అమ్మడు కూడా క్రేజ్ ఉన్నప్పుడే వరుస పెట్టి సినిమాలు చేయాలనే ఉద్దేశంతో తనకు వచ్చిన ఆఫర్లలో ది బెస్ట్ సెలెక్ట్ చేసుకుంటూ కెరీర్లో ముందుకు దూసుకెళ్తుంది. ప్రేమలు సినిమా మమిత కెరీర్ ను ఎంతగా మార్చిందంటే ఆ సినిమా తర్వాత ఏకంగా తనకు సూర్య, విజయ్ లాంటి హీరోలతో నటించే ఛాన్సులు తెచ్చి పెట్టేంత. విజయ్ నటిస్తున్న ఆఖరి సినిమా జన నాయగన్ లో మమిత కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తోన్న సూర్య46లో ఏకంగా సూర్య సరసన నటిస్తోంది. వీటితో పాటూ ప్రదీప్ రంగనాథన్ తో కలిసి డ్యూడ్ సినిమా చేస్తోంది. ఆల్రెడీ చేస్తున్న ఇరండు వానం రిలీజ్ కు రెడీ అయింది. ఇక రీసెంట్ గా ప్రేమలు సినిమాలో అమూల్ డెవిస్ పాత్రలో కనిపించిన సంగీత్ ప్రతాప్ తో కలిసి ఓ సినిమా చేయడానికి మమిత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మమిత. ఈ సినిమా పూర్తి స్థాయి ప్రేమ కథా చిత్రంగా రాబోతుంది. ప్రేమలు తర్వాత మలయాళ, తమిళ సినిమాల్లో బాగా బిజీగా మారిన మమిత, సూర్య46 తర్వాత తెలుగు లో కూడా బిజీ అయ్యే అవకాశాలున్నాయి.

## మరోసారి
# సెంచరీ కొట్టేసిన ధనుష్

**- ఇటీవల కాలంలో ధనుష్ నటించిన నాలుగు సినిమాలు వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం**



మెల్లగా తన మార్కెట్‌ను బలోపేతం చేసుకుంటున్న తమిళ స్టార్ హీరో ధనుష్‌కు 'కుబేర' సినిమా మరో పెద్ద విజయాన్ని అంధించింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, విడుదలైన తొలి రోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. నాగార్జున, రష్మిక మందన్నా వంటి స్టార్ కాస్ట్, ధనుష్ ఆకట్టుకునే నటన కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలిపాయి. లేటెస్ట్‌గా 'కుబేర' సినిమా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి గణనీయమైన ఘనత సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇది విడుదలైన 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. సినిమాపై ముందు నుంచి ఉన్న అంచనాలు, ధనుష్‌కు టాలీవుడ్‌లో ఏర్పడిన క్రేజ్ కారణంగా ఈ విజయాన్ని సాధించినట్టు సినీ విశ్లేషకులు చెబుతున్నారు. 'కుబేర' సినిమా ఒక ధనవంతుడు, ఒక పేదవాడు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో రూపొందింది. ఇందులో ధనుష్ నటించిన దేవా పాత్రకి విశేషంగా స్పందన లభించింది. నాగార్జున నటించిన దీపక్ పాత్ర కూడా ఇంటెన్స్ గా ఉండటంతో ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకుంది. రష్మిక పాత్రకు మంచి సీట్ టైం ఉండగా, కథానాయికగా ఆమె కథను మలుపు తిప్పే పాత్రలో కనిపించగా సినిమా ఎమోషన్‌కి బలాన్నిచ్చింది. సుమారు 3 గంటల నిడివితో తెరకెక్కిన ఈ చిత్రం టెక్నికల్‌గా కూడా ప్రశంసలు అందుకుంది. నేపథ్య సంగీతం, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అన్ని కూడా హైలైట్‌గా నిలిచాయి. ముఖ్యంగా ధనుష్ నటనలో భిక్షగాడి యాంగిల్‌కి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ హైఎమోషనల్ కమర్షియల్ డ్రామా, టికెట్ల రేట్లు పెరిగినా కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను బాగా ఆకర్షించింది. ఇక ఇటీవల కాలంలో ధనుష్ నటించిన నాలుగు సినిమాలు వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం. తిరు సార్ రాయన్ కుబేర ఈ విజయాలతో ధనుష్ తెలుగులో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. ఇక 'కుబేర' వంటి హిట్‌తో ఆయనకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయం అని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక నెక్ట్స్ ఎలాంటి విజయాలు అందుతాయో చూడాలి





## ఇంగ్లాండ్‌తో జరిగిన
# తొలి టెస్టులో టీమిండియా ఓటమి

**- భారత్ నిర్దేశించిన 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లాండ్**
**- మ్యాచ్‌లో ఐదు సెంచరీలు చేసినా భారత్‌కు తప్పని పరాజయం**

ఒకే టెస్టులో ఐదు శతకాలు నమోదు చేసి ఓడిన తొలి జట్టుగా భారత్ రిషభ్ పంత్ రెండు, జైస్వాల్, గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలు వృథా లీడ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో భారత జట్టు పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమితో టీమిండియా ఒక అవాంఛనీయ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఒకే టెస్టు మ్యాచ్‌లో ఐదు సెంచరీలు సాధించి కూడా ఓటమి చవిచూసిన తొలి జట్టుగా చెత్త రికార్డును మూటగట్టుకుంది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇరు జట్ల ఆటగాళ్లు పరుగుల వరద పారించారు. ముఖ్యంగా భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలు నమోదు చేశాడు. అతను వరుసగా 134, 118 పరుగులు సాధించాడు. అతనితో పాటు యశస్వి జైస్వాల్ (101), శుభ్‌మన్ గిల్ (147), కేఎల్ రాహుల్ (137) కూడా సెంచరీలతో కదం తొక్కారు. ఈ ఐదు శతకాలతో భారత్ భారీ స్కోర్లు సాధించినప్పటికీ, బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలమయ్యారు. మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 371 పరుగుల విజయలక్ష్యాన్ని ఇంగ్లాండ్ జట్టు కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. దీంతో సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.కాగా, టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఐదు సెంచరీలు నమోదైన తర్వాత కూడా ఓటమిపాలైన జట్టుగా భారత్ నిలవడం గమనార్హం.

ఇంతకుముందు ఈ చెత్త రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉండేది. 1928-29 యాషెస్ సిరీస్‌లో భాగంగా జరిగిన ఒక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆటగాళ్లు నాలుగు సెంచరీలు చేసినప్పటికీ, ఆ జట్టు ఓటమిని చవిచూసింది. ఆ మ్యాచ్‌లోనే దిగ్గజ ఆటగాడు డాన్ బ్రాడ్‌మాన్ తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేయడం విశేషం. ఇప్పుడు ఆ రికార్డును టీమిండియా అధిగమించి, ఐదు సెంచరీలతో ఈ జాబితాలో అగ్రస్థానానికి చేరింది. ఈ ఓటమి భారత క్రికెట్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

## 5 సెంచరీలు చేసి..ఐదో రోజు ఓటమి..
# టీమ్ ఇండియా ఇదొక చరిత్ర !

**-బ్యాటింగ్‌తో పోల్చితే టీమ్ ఇండియా బౌలింగ్ బలహీనంగా ఉంది**
**- తుది జట్టులో మూడో పేసర్‌గా ఎవరు ఉండాలి అనేది తేల్చుకోవాలి**



మూడు నెలలు కర్రసాము చేసి మూలనున్న ముసలామె మీద ప్రతాపం చూపాడని వెనుకటికి ఒక సామెత..! దీన్ని కాస్త అటుఇటు మార్చితే టీమ్ ఇండియా ప్రస్తుత పరిస్థితికి సరిగ్గా సరిపోతుంది. ఇంగ్లండ్‌తో హెడింగ్లీలోని లీడ్స్ మైదానంలో తొలి టెస్టులో భారత జట్టు ఓడిపోయింది. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో తొలి మ్యాచ్‌లోనే పరాజయం మూటగట్టుకుంది. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో భారత్‌దే చాలావరకు పైచేయి.. కానీ, ఇంగ్లండ్ క్రమక్రమంగా పట్టుసాధించి ఏకంగా టెస్టును ఖాతాలో వేసుకుంది. ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ)ను టీమ్ ఇండియా పరాజయంతో మొదలుపెట్టేలా చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైశ్వాల్, కెప్టెన్ గిల్, వైస్ కెప్టెన్-వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ సెంచరీలతో టెస్టును సూపర్‌గా ప్రారంభించింది. 471 పరుగులు చేసి ఇంగ్లండ్‌ను 465 వద్ద ఆపింది. కానీ, రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులకు ఆలౌట్ ప్రత్యర్థికి అవకాశం ఇచ్చింది. 371 పరుగుల టార్గెట్‌ను ఇంగ్లండ్ 5 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టెస్టు ద్వారా గిల్ సేన చాలా నేర్చుకోవాల్సి ఉంది. అవేమిటంటే..? ఎమర్జెన్సీతోనే కాదు.. మరో విధంగానూ చరిత్రలో మరువలేనిది -బ్యాటింగ్‌తో పోల్చితే టీమ్ ఇండియా బౌలింగ్ బలహీనంగా ఉంది.

తుది జట్టులో మూడో పేసర్‌గా ఎవరు ఉండాలి అనేది తేల్చుకోవాలి. ప్రసిద్ధ్ క్రిష్ణ కేవలం బంతులు విసరడానికే అన్నట్లున్నాడు. రెండు ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లు వేసి 220 పరులిచ్చాడు. ఈ స్థాయిలో ప్రదర్శనకు వికెట్లు తీసినా వేస్ట్. కాబట్టి మూడో పేసర్‌గా అర్షదీప్ సింగ్‌ను కానీ, ఆకాశ్ దీప్‌ను గాని తీసుకునే ఆలోచన చేయాలి. -లీడ్స్ టెస్టులో శుద్ధ దండగ పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్. తెలుగు కుర్రాడు, పేస్ బౌలింగ్ వేయగల బ్యాటింగ్ ఆల్ రౌండర్ అయిన నితీశ్ కుమార్ రెడ్డిని కాదని శార్దూల్‌ను తీసుకుంటే పూర్తిగా నిరాశపరిచాడు. బ్యాటింగ్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ విఫలమయ్యాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్‌గా మరింత ఫెయిల్ అయ్యాడు. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో వరుసగా 2 వికెట్లు తీసినా అవి పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. అసలు శార్దూల్‌కు బంతిని ఇవ్వడమే ఆలస్యం చేశారు. అలాంటివాడు జట్టులో అవసరమా? అనేది టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచించాలి. రిషభ్ పంత్.. 2 సెంచరీలు.. అనేక రికార్డులు.. ఒక ఐసీసీ డీమెరిట్ -సాయి సుదర్శన్ కొత్త కుర్రాడు కాబట్టి అతడికి కొంత సమయం ఇవ్వొచ్చు. అయితే, 8 ఏళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్ తుస్ అనిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్.. రెండో ఇన్నింగ్స్‌లో 20 పరుగులే చేశాడు. లోయరార్డర్‌ను కలుపుకొని పోతూ ఒకప్పటి వీవీఎస్ లక్ష్మణ్‌లా ఆడాల్సిన వాడు విఫలమయ్యాడు. కరుణ్ రెండో టెస్టుకు లోపాలను సరి చేసుకోవాలి. అసలు లోయరార్డర్ ఉందా...? లీడ్స్ టెస్టులో టీమ్ ఇండియా లోయరార్డర్ మరీ పేలవం. స్పిన్ ఆల్‌రౌండర్ నుంచి ఆల్ రౌండర్‌గా ఎదిగిన రవీంద్ర జడేజా.. బౌలింగ్, బ్యాటింగ్‌లో బాధ్యతలకు న్యాయం చేయలేకపోయాడు. రెండో ఇన్నింగ్స్‌లో కొద్ది పరుగులు చేసినా అప్పటికే ఆలస్యమైంది. శార్దూల్ ఠాకూర్ కూడా పేలవంగా ఆడడంతో లోయరార్డర్ నుంచి జట్టుకు ఫాయిదా లేకపోయింది. సోమర్‌సాల్ట్ కాదు..డెలీ అలీ..పంత్ సెలబ్రేషన్.. గావస్కర్‌కు షాక్ ఇన్ని క్యాచ్‌లు మిస్ చేస్తారా? క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి.. కానీ, లీడ్స్ టెస్టులో టీమ్ ఇండియా ఓపెనర్ జైశ్వాల్ ఒక్కడే నాలుగు క్యాచ్‌లు జారవిడిచాడు. అత్యుత్తమ ఫీల్డర్ అయిన జడేజా కూడా ఒక క్యాచ్ వదిలేశాడు. దీనిపై వెంటనే ఫోకస్ పెట్టాలి. ఇక పిచ్ పరిస్థితులు బౌలింగ్‌కు అనుకూలంగా లేనిది వాస్తవమే. మన బౌలింగ్ బలహీనంగా ఉన్నదీ వాస్తవమే. అలాంటప్పుడు డ్రా చేసుకోవాలి. కానీ, ఓడిపోయారు.

## పెట్టుబడుదారుల ప్రభుత్వానికి

# వ్యతిరేకంగా పోరాటం సాగించాలి



**పత్తికొండ టౌన్ - సూర్యవాస్తవం, జూన్ 25:** బూర్జోవ పెట్టుబడిదారుల అవినీతికి నిలయంగా మారిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ సమాజ స్థాపనకు కోసం పోరాటం కొనసాగించాలని డి. రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పత్తికొండ పట్టణంలోని మడ్డికేరి శాఖ మహాసభ బుధవారం నిర్వహించడం జరిగినది శాఖ కార్యదర్శి ఇలియాస్ భాష అధ్యక్షతన జరిగిన మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ పత్తికొండ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ మాట్లాడుతూ దోపిడీ పెట్టుబడిదారులకు దేశ సంపద దోచిపెడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని వారి పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ శాఖ నుంచి జాతీయ స్థాయి వరకు శత వార్షికోత్సవ సభలు ర్యాలీలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో పోరాటాలు ఉద్యమాల ద్వారా విజయాలు సాధించి ప్రజల పక్షాన నిరంతరం పోరాటం నిర్వహిస్తూ ఉంది 100 సంవత్సరాలైనా పార్టీ ప్రజల మన్ననలు పొందుతూనే ఉంది. కేంద్రంలో రాష్ట్రంలో జరుగుతున్నటువంటి రాజకీయ స్థితిగతులు ప్రజా వ్యతిరేక విధానాలు. కార్మిక కర్షక వ్యతిరేక చట్టాల ద్వారా పేద ప్రజలు రైతులు ప్రభుత్వ నిర్వాకాల వల్ల నలిగిపోతూనే ఉన్నారు కార్పొరేట్ శక్తులను ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయి. ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతున్నాడు. పేదవాడు ఇంకా పేదవాడుగా తయారవుతున్నాడు. దీనికి ఉదాహరణ గతంలో ఉన్న మిలియనీర్లు రెండింతలు అవ్వడమే నిదర్శనం స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలు సెంటు వ్యవసాయ భూములేని వారు గ్రామంలో స్మశాన స్థలాలు కూడా లేని గ్రామాలు ఇంకా ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్న ప్రజల తలరాతలు మారడం లేదు అందుకే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిర్వహించే మండల జిల్లా మహాసభలలో ప్రజల పక్షాన పోరాడడానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఉద్యమాలు నిర్వహించాలని అందుకు జులై మొదటి వారంలో మండల మహాసభ వేదిక కాలున్నదని తెలియజేశారు పార్టీ కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారుమంచి చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న, ఎఐటియుసి తాలూకా అధ్యక్షుడు నెట్టికంటయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు ఉపేంద్ర, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మడ్డిగిరి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మడ్డి గిరి, సిపిఐ శాఖా కార్యదర్శు ఇలియాస్ భాష, శాఖ సహాయ కార్యదర్శులు నాగేష్, సుంకర రామాంజనేయులు, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ముగిసిన మహిళా సర్పంచుల శిక్షణ తరగతులు



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 25:** స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డి.పి.ఆర్.సి భవనంలో "స్థానిక పాలనలో మహిళా సాధికారత గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు" నేపథ్యంతో గ్రామ పంచాయితీ మహిళా సర్పంచులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మెదటగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామాలే దేశ పట్టు కొమ్మలు అని చెప్పారు, మరి అలాంటి గ్రామ పంచాయితీలకు ప్రథమ పౌరునిగా, గ్రామ పంచాయుతీ అధ్యక్షులుగా ప్రజల చేత ప్రజాస్వామికంగా ఎన్నికైన సర్పంచుల పాత్ర చాలా కీలకం, అలాంటి సర్పం చులలో మహిళలకు రాజ్యాంగ పరంగా సమాన అవకాశాలు కల్పించడం, అలాంటి అవకాశాలని ఈ రోజు అన్ని రంగాలలో మహిళలు అందిపుచ్చుకోవడం మరి ముఖ్యంగా రాజకీయ రంగంలో ఇంతమంది ప్రజా ప్రతినిధులుగా, తమ గ్రామాన్ని, మండలాన్ని మరియు జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, అభివృద్ధికి తమవంతు కృషి చేయడం ఒక మహిళగా చాలా గర్వపడుతున్నాను. మరి ఈ వ్యవస్థ మనకు అందించిన అవకాశాన్ని ప్రతి ఒక్క సర్పంచు సద్వినియోగం చేసుకుని, ఎవరికీ అందించిన విధులను, నిధులను గ్రామ అభివృద్ధి కి సమర్ధవంతంగా వినియోగించుకుని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను పొందాలని తెలియజేస్తూ, అలాగే ప్రతి ఒక్కరూ వారి సంభందిత గ్రామ పంచాయితీ పరిధులలో మొక్కలను నాటి, నాటించి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.శివశంకర్, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, జిల్లా పంచాయితీ అధికారి నాగరాజు మరియు డిప్యూటి యం.పి.డి.ఓ లు మహిళా సర్పంచులు, అధికారులు పాల్గొనారు.

## సమాజాన్ని ప్రేమించిన

# చిప్పల పాల్ చెంగయ్యకు ఘన నివాళులు







**తిరుపతి జిల్లా, పెళ్లకూరు - సూర్యవాస్తవం, జూన్ 25:** పెళ్లకూరు మండలం దిగువ చావలి గ్రామానికి చెందిన విశ్వాస మార్గదర్శి, విరాళదాత, సామాజిక సేవకులు చిప్పల పాల్ చెంగయ్య ఆదరణ - స్తుతి కూడిక ఉదయం గ్రామంలోని వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం హాజరై తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు తెలుగుదేశం యువనేత నెలవల రాజేష్ కూడా పాల్గొని, చెంగయ్య సేవలను స్మరించుకున్నారు. ఈ సభను ఈ సి ఐ సౌత్ ఆంధ్రా దయాసిస్ ప్రధాన అధికారి బిషప్ రైట్ రెవరెండ్ బిషప్ ఎబెల్ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. బిషప్ మాట్లాడుతూ చెంగయ్య నాకున్న 45 ఏళ్ల పరిచయంలో ఆయన దేవుని సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. మారుమూల ప్రాంతాల్లో గిరిజన ప్రాంతాల్లో చర్చిల నిర్మాణానికి పునాది వేసిన మహానుభావుడు," అని పేర్కొన్నారు. వేదికపై ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు రాజకీయ నాయకులు, మత పెద్దలు, బంధువులు, సంఘటనలను పంచుకున్నారు. చెంగయ్య కుటుంబ సభ్యులు – కుమారులు చిప్పల కృష్ణయ్య, చిప్పల రమణయ్య, కుమార్తెలు గోను వజ్రమ్మ, శ్రీపతి రాజమ్మ వారి కొడుకులు, కుమార్తెలకు, మానవాళ్లకు, మనుమరాళ్లకు, బంధువులకు, స్నేహితులుకు అందరికి బిషప్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది బంధువులు, గ్రామస్తులు, క్రైస్తవులు రాజకీయ నాయకులు హాజరై ఆయన పట్ల తమ అభిమానాన్ని, గౌరవాన్ని నివాళుల రూపంలో వ్యక్తం చేశారు. ఇంటి దగ్గర ప్రార్ధనలతో ప్రారంభమైన కార్యక్రమం, 10 గంటల నుండి మధ్యాహ్న 3 గంటల వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో చెంగయ్య మనవళ్లు కలిసి ప్రత్యేకంగా పచ్చదనం పెంపొందించాలన్న, జ్ఞాపకార్ధంగా ఉండాలనే ఆకాంక్షతో కూడి వచ్చిన ప్రతి ఒక్కరికి తైవాన్ జాతికి సంబంధించిన జామ చెట్టు అందరికీ ఇవ్వడం ప్రత్యేకంగా నిలిచింది. విజయవంతంగా నిర్వహించిన కుటుంబానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## చెత్త కష్టాలకు చెక్...!

# ఎమ్మెల్యే చొరవతో వాహనాలకు దారి



**కదిరి - సూర్య వాస్తవం, జూన్ 25:** కదిరి పట్టణంలోని స్థానిక తుమ్మల రోడ్డులో ఉన్న మున్సిపల్ చెత్త వేసే డంపింగ్ యార్డుకు చెత్త నిండి పోవడం వలన అటు వైపు వెళ్లే వాహనాలను చెత్త వేసే ట్రాక్టర్లకు దారిలేకుండా వాహన దారులు, ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు కందికుంట ప్రసాద్ వెంటనే స్థానిక మున్సిపల్ ఛైర్పర్సన్ డిల్షాదున్నిసా, బహుద్దీన్, మున్సిపల్ సిబ్బంది శానిటరీ విభాగం డంపింగ్ యార్డుకు సందర్శించి వెనువెంటనే రహదారికి అడ్డంగా ఉన్న అక్కడి చెత్తను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా దారి చేసి మట్టి రోడ్డు నిర్మాణం, చెత్తను రెండు హిటాచీలతో ఒకపక్కకు వేయించడం చేశారు. అక్కడ జరుగుతున్నటువంటి పనులను వాటిని పరిశీలించి సూచనలు సలహాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కె ఎస్ దిల్షాదున్నిసా బహవుద్దీన్, వైస్ ఛైర్మన్ సేగు సుధా రాణి, బాబయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్, బండారు మురళి, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రహల్లాద్, వర్క్ ఇన్స్పెక్టర్ రహీం, కాంట్రాక్టర్ ఎస్ బి చలపతి తదితరులు ఉన్నారు.

## ప్రజల అభ్యర్థనలకు

# రాష్ట్ర రవాణా శాఖ మంత్రి హామీ

### - రాయచోటి టిడిపి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 25:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని టిడిపి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు మంత్రి ని కలిసి తమ సమస్యలు వినిపించి పలు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల అర్జీలపై తగిన చర్యలు తీసుకుంటా మని మంత్రి హామీ ఇవ్వడంతో మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసి వెనుతిరిగారు.

## పాఠశాల విద్యార్థులకు

# రవాణా సౌకర్యం కల్పించిన మంత్రి మండిపల్లి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 26:** కోట్టమడ్డి గ్రామానికి బస్సు సౌకర్యం కోసం స్థానిక టీడీపీ నాయకుడు సేనివారపు మోహనరెడ్డి రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి వారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అర్జీ అందగానే మంత్రి వెంటనే స్పందించి కడప డిపో మేనేజర్ను ఫోన్ ద్వారా ఆదేశించి, 11 బెటాలియన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం తక్షణమే బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించిన మంత్రి కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏపి సెక్రటేరియట్‌లో వివిధ శాఖల మంత్రులు

### - సెక్రటరీలతో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర చర్ల హరి



**తాడపత్రి - సూర్యవాస్తవం, జూన్ 25:** ఆంధ్రప్రదేశ్ సెక్రటరీయట్ యందు వివిధ శాఖల మంత్రులు సెక్రటరీలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల సమస్యలపై మంత్రులు సవితను పయ్యావుల కేశవ్ను టీజీ భరత్ను సంధ్య రాణిని మంత్రాలయం ఇన్చార్జి వాల్మీకి రాఘవేంద్రను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్గ సెక్రటరీ ఐఏఎస్ కృష్ణతేజకి, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘానికి సమస్యలు వివరించి వినతి పత్రాలు అందజేయడం జరిగింది. వారు కూడా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వారందరికీ బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర చర్ల హరి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## లక్ష్మీనరసింహస్వామి

# ఆలయంలో ఆర్డీవో అమావాస్య పూజలు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 25:** పత్తికొండ పట్టణంలోని స్థానిక ఆదోని రోడ్డులో గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆర్డీవో భరత్ నాయక్ దంపతులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నాడు అమావాస్య సందర్భంగా వీరభద్ర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగేంద్ర, బంగారు షాప్ శ్యామ్, ఆలయ కమిటీ మెంబర్లు అంజి, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు

## శ్రీకాళహస్తి నియోజకవర్గ

# పరిశీలకుడిగా భీమవరం నేతకు బాధ్యత



**పెళ్లకూరు - సూర్యవాస్తవం, జూన్ 25:** శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల కోసం పరిశీలకుల నియామకం జరిగింది. ఈ క్రమంలో పెళ్లకూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు దామెర్ల ప్రసాద్ నాయుడును పార్టీ అధిష్టానం నియమించింది. బుధవారం జరిగిన ఈ సంస్థాగత ఎన్నికల సమావేశంలో ఆయన శ్రీకాళహస్తి రూరల్ మండల పరిశీలకుడిగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. పార్టీలో నిష్టా, నిబద్ధత కలిగిన నాయకుడిగా ప్రసాద్ నాయుడు వ్యవహరిస్తూ, పరిశీలకుడిగా నియామకం పొందడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**మదనపల్లి - సూర్యవాస్తవం, జూన్ 25:** మదనపల్లి పట్టణం, చిత్తూరు బస్టాండు సమీపంలోని టౌన్ హాలుకు దగ్గరలో ఉన్న ఓ బ్రాందీ షాపుకి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అతిగా మద్యంతాగి మృతి చెందడం కలకలం రేపు తోంది.బుధవారం సాయంత్రం వెలుగు చూసిన ఘటనపై. ఒకటవ పట్టణ ఎస్సై శివకుమార్ కథనం.. సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి స్థానిక చిత్తూరు బస్టాండ్ శేషమహ ల్ రోడ్డు, టౌన్ హాల్ సమీపంలోని ఓ బ్రాందీ షాప్ దగ్గరలో అతిగా మద్యం తాగిన గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించారని చెప్పారు. వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామ నిర్వహించి మార్చురీకి తరలించామన్నారు. గుర్తుతెలియని వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే ఒకటవ పట్టణ పోలీసులను ఆశ్రయించాలని చెప్పారు.

## ఉరి వేసుకుని చేనేత కార్మికుడు ఆత్మహత్య



**మదనపల్లి - సూర్యవాస్తవం, జూన్ 25:** ఉరి వేసుకుని చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం మదనపల్లి మండలంలో వెలుగు చూసింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. సత్యసాయి జిల్లా ధర్మవరం కేతిరెడ్డి కాలనీలో కాపురం ఉంటున్న చేనేత కార్మికుడు భోజనపు నాగరాజా (60) మూడు రోజుల క్రితం మదనపల్లిలో ఉన్న తన కూతురు ఇంటికి వచ్చినట్లు తెలిసింది. ఏం కష్టం వచ్చిందో ఏమో.. మదనపల్లె బెంగళూరు రోడ్డు, చిప్పిలి పాల డైరీ కి సమీపాన ఉన్న చింత తోపులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోవడాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించాలని చెప్పారు. వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పంచిన అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చరీకి తరలించామని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత





**హిందూపురం - సూర్యవాస్తవం, జూన్ 25:** హిందూపురం శాసన సభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతో పురం మునిసిపల్ పట్టణ పరిధిలో పదిమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్ చేతుల మీదుగా సీ.ఎమ్. సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కుల పొందిన లబ్ధిదారులు కష్టకాలంలో శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ మమ్మల్ని ఆదుకున్నారని మా కుటుంబానికి చేయూతను అందించిన శాసనసభ్యులు బాలకృష్ణ కి రుణపడి ఉంటామని తెలుపుతూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## జాయింట్ ఎల్పీఎం భూములపై ఆన్‌లైన్ సబ్‌డివిజన్‌కు అవకాశం

### - రీసర్వే పూర్తైన గ్రామాల రైతులకు తహసీల్దార్ కార్యాలయం నుండి శుభవార్త

**పెళ్లకూరు - సూర్యవాస్తవం, జూన్ 25:** పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, ఆర్లపాడు, శెట్టిగుంట, బంగారంపేట, కానూరు, ఊడిపూడి గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఈ గ్రామాలలో కొంతమంది రైతులకు చెందిన భూములు జాయింట్ ల్యాండ్ పార్సల్ మ్యాప్ (జాయింట్ ఎల్పీఎం) పరిధిలో ఉన్నాయని గుర్తించారు. జాయింట్ ఎల్పీఎం భూములు కలిగిన రైతులు, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, మండల సర్వేయర్, గ్రామ సచివాలయ సర్వేయర్‌లతో కలిసి తమ భూములపై ఆన్‌లైన్ సబ్‌డివిజన్ చేసుకునే అవకాశం కల్పించామని డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్ పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ భూమి సమాచారం క్లియర్ చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ అవసరాల కోసం భూమి విభజన అవసరమైన రైతులకు ఇది ఎంతో ఉపయుక్తమవుతుందని స్పష్టం చేశారు.

### అంతర్జాతీయ మాదకద్రవ్యాల

# దుర్వినియోగంపై నేడు జిల్లా అంతటా ర్యాలీ

### - టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 25 :-** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన నగరంలో, జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. బుధవారం రాత్రి అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా 26 వ తేదీ నిర్వహించనున్న ర్యాలీపై జిల్లా ఎస్పీ పి.జగదీష్, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీవోలు, డిఎస్పీలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సిఐలు, ఎస్సైలు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, తదితర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26న సాయంత్రం 04:30 గంటల నుంచి 05:30 గంటల వరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన కార్యాలయంల, ప్రతి మండలంలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతపురం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్లో కార్యక్రమం నిర్వహించాలని, ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, పిడిలు, పిఈటిలు, తదితరులు ప్లకార్డులు, స్లోగన్స్ తో పాల్గొనాలన్నారు. గత ఏడాది కాలంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతి రేకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా వివరించాలన్నారు. ఈ రంగంలో గణనీయమైన కృషి చేసిన కార్యనిర్వా హకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, వాలంటీర్లను గుర్తించి మాట్లాడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియ జేయాలన్నారు. ఈ కార్యక్రమం కోసం మినిట్ టు మినిట్ ప్రోగ్రాం తయారు చేయాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా అని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఈ ర్యాలీలను నిర్వహించాలని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ర్యాలీలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ర్యాలీలో ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ వారు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ ర్యాలీల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

## రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి

### - సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ.



**నాయుడుపేట-సూర్య వాస్తవం, జూన్ 25:** రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తూ సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేయడం జరిగిందని ఎమ్మెల్యే నెలవల విజయ్ శ్రీ అన్నారు.. బుధవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ 15 మంది లబ్ధిదారులకు 25,80,342/-రూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఇప్పటి వరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో 1,42,00,000/- కోటి 42 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండు సమపాళ్లలో చేసుకుంటూ రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడంలో ఎల్లవేళల ముందుంటాడని తెలియజేశారు. ఎవరి ద్వారా అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర ప్రజలు కూడా గ్రహించాలని మళ్లీ చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్,నియోజకవర్గం ఆరు మండలాల తెదేపా అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి

### - కమిషనర్ షేక్ ఫజులుల్లా



**నాయుడుపేట-సూర్య వాస్తవం, జూన్ 25:**

నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని కరెంట్ ఆఫీస్ సెంటర్లో బుధవారం జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా పరిశీలించారు. ప్రతి నిత్యం ఉదయం 5గంటలకే మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మున్సి పాలిటీలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య కార్మికుల చేపడుతున్న పనులను పరిశీలించి, పారిశుధ్యన్ని మెరుగుపరి చేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలు పారిశుధ్యన్ని మెరుగుప రిచేందుకు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి తమ ఇళ్ల వద్దకు వచ్చే పరిస్థితి కార్మికులకు అందించాలని సూచించారు. చెత్తాచెదారాలను డ్రైనేజీ కాలవల్లో వేయకూడదన్నారు.పట్టణ ప్రజలు అవగాహన లేకుండా డ్రైనేజీ కాలవల్లో చెత్తను వేయడం వల్ల మురుగునీరు పారే వీలు లేకుండా పోతుంది అన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఆయన వెంట సచివాల సిబ్బంది పెంచల రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మదనపల్లె నుండి గుంటూరుకు సూపర్ ఫాస్ట్ రైలు





**మదనపల్లి - సూర్యవాస్తవం, జూన్ 25:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి నుండి గుంటూరు కు సూపర్ ఫాస్ట్ రైలు ను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ రైలు ప్రతిరోజు సాయంత్రం 3 గంటలకు మదనపల్లి రోడ్డులో ప్రారంభమై పీలేరు, పాకాల, తిరుపతి, ఎర్రగుంట్ల, మార్కాపురం మీదుగా గుంటూరు చేరుకుని తిరిగి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు మదనపల్లి రోడ్డుకు చేరుకుంటుంద న్నారు.ఈ ప్రారంభో త్సవానికి ముఖ్యఅతిథిగా బిజెపి జాతీయ నేత చల్లపల్లి నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలు సులభతరంగా సుదూరు ప్రాంతాలకు రైలులో ప్రయాణించేందుకు వీలుగా ఈ రైలును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మదనపల్లి నుండి గుంటూరు కు సూపర్ఫాస్ట్ రైలు సేవలు అందుబాటులోకి రావడం గర్వంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రైలు ప్రయాణం ద్వారా లబ్ధి పొందవచ్చని చెప్పారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )